నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 5-2-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 159 | పేజీలు: 4 | వెల: రూ.1/-

అసదుద్దీన్ ఒవైసీకి జడ్ కేటగిరి భద్రత...కేంద్ర హోంశాఖ నిర్ణయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:ఎంఐఎం పార్టీ అధినేత,హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీకి సీఆర్పిఎఫ్ జడ్ కేటగిరి సెక్యూరిటీ కల్పిస్తూ కేంద్ర హోంశాఖ నిర్ణయం తీసుకుంది.నిన్నటి కాల్పుల ఘటన నేపథ్యంలో భద్రతపై సమీక్ష చేసి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర హోంశాఖ వెల్లడించింది.

తక్షణమే సెక్యూరిటీ భద్రత అమల్లోకి వచ్చేలా ఆదేశాలు జారీ చేశారు. 24 గంటల పాటు వ్యక్తిగత భద్రతా అధికారితో పాటు 22 మంది సీఆర్పిఎఫ్ సిబ్బందితో భద్రత కల్పించారు. ఆరుగురు నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ కమెండోలు, పోలీసులతో సహా 22మంది సిబ్బందితో భద్రత ఏర్పాటు చేశారు. ఎస్కార్టు కారుతోపాటు ఢిల్లీ పోలీసులు, ఐటీబీపీ, సీఆర్పిఎఫ్ సిబ్బంది రక్షణగా ఉంటారు.తాను ఎప్పుడూ భద్రతను కోరుకోలేదని, ఎందుకంటే తన ప్రాణాలను రక్షించడం ప్రభుత్వ బాధ్యత అని ఒవైసీ నొక్కి చెప్పారు.

హైదరాబాద్ పర్యటనకు ప్రధాని..ఏర్పాట్లను పరిశీలించిన సీఎస్, డీజీపీ

హైదరాబాద్, ఫిబ్రవరి 4: ప్రధాని మోడీ హైదరాబాద్ పర్యటనకు రానున్న నేపథ్యంలో నగరంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సీఎస్ సోమేశ్ కుమార్ ఆఫీసర్లను ఆదేశించారు. సమతామూర్తి కేంద్రం, విగ్రహ పరిసరాలను సీఎస్ సోమేశ్ కుమార్, డీజీపీ మహేందర్ రెడ్డి పరిశీలించారు. పీఎం టూర్‌ను విజయవంతం చేసేందుకు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రధాని పాల్గొనే వేదికల వద్ద భద్రతా ఏర్పాట్లతోపాటు, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తును బ్లూబుక్ ప్రకారం అమలు చేయాలని పోలీసు శాఖను ఆదేశించారు. వీవీఐపీ పర్యటన సమయంలో కరోనా ప్రొటోకాల్స్ పాటించేలా చూడాలని హెల్త్ సెక్రటరీని సీఎస్ ఇప్పటికే ఆదేశించిన సంగతి తెలిసిందే..వీవీఐపీ పాస్ హోల్డర్లకు షెడ్యూల్ చేసిన ప్రోగ్రామ్‌కు ముందే ఆర్టీ పీసీఆర్ కోవిడ్ టెస్టులు చేయాలన్నారు. పీఎం కాన్వాయ్ వెళ్లే మార్గంలో రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, లైటింగ్ ఏర్పాట్లు చేయాలని ఆర్ అండ్‌బీ అధికారులను ఆదేశించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, ఇతర వేదికల వద్ద ఏర్పాట్లను పరిశీలించాలని రంగారెడ్డి, సంగారెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. ప్రధాని పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, ఎక్కడా కూడా భద్రత విషయంలో చిన్న పొరపాటు కూడా ఉండకూడదని అధికారులను ఆదేశించారు.

మంత్రి తలసానికి అరుదైన అవకాశం

హైదరాబాద్, ఫిబ్రవరి 4: జంటనగరాలకు చెందిన పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కు అరుదైన అవకాశం లభించింది. శనివారం నగరానికి రానున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి స్వాగతం పలకడంతో పాటు, వెళ్లేప్పుడు వీడ్కోలు పలికే అవకాశాన్ని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు కల్పించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం నగరానికి చేరుకోనున్న ప్రధాని మోదీకి మంత్రి తలసాని ఎయిర్ పోర్ట్ లో ఆయనకు స్వాగతం పలకనున్నారు. అలాగే విళ్లే సమయంలోనూ మంత్రి తలసాని ప్రధాని వెంట వుండి వీడ్కోలు పలుకుతారు.

నేడు తెలంగాణకు రానున్న ప్రధాని మోడీ..

హైదరాబాద్, ఫిబ్రవరి 4:ప్రధాని నరేంద్ర మోడీ రేపు హైదరాబాద్ పర్యటనకు వస్తున్నారు. రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్‌లో నిర్వహిస్తున్న రామానుజచార్యుల సహస్రాబ్ది సమారోహంలో పాల్గొననున్నారు. అంతేకాకుండా సంగారెడ్డి జిల్లాలోని ఇక్రిసాట్ స్వర్ణోత్సవాలకు హాజరవుతారు. మొత్తంగా ప్రధాని తెలంగాణ టూర్ ని పరిశీలిస్తే.. రేపు (5వ తేదీ) మధ్యాహ్నం 2.10 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో పఠాన్‌చెరులోని ఇక్రిశాట్ క్యాంపస్‌కు వెళ్తారు. ఇక్రిశాట్ 50వ వార్షికోత్సవ వేడుకలను మోడీ ప్రారంభిస్తారు. మొక్కల సంరక్షణకు సంబంధించి ఇక్రిశాట్ వారి వాతావరణ మార్పు పరిశోధనా సదుపాయం, రాపిడ్ జనరేషన్ అడ్వాన్స్ మెంట్ ఫెసిలిటీని ప్రధాని ప్రారంభిస్తారు. ప్రత్యేకంగా రూపొందించిన ఇక్రిశాట్ లోగోను ఆవిష్కరిస్తారు. ప్రత్యేకంగా రూపొందించిన పోస్టల్ స్టాంప్‌ను కూడా విడుదల చేయనున్నారు మోడీ.

ఆ తర్వాత ముచ్చింతల్ కు ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలు దేరి వస్తారు ప్రధాని మోడీ. దాదాపు 5 గంటల ప్రాంతంలో ఆయన ముచ్చింతల్‌లోని చినజీయర్ స్వామి ఆశ్రమానికి చేరుకుంటారు.

అక్కడ రామానుజాచార్య సహస్రాబ్ది ఉత్సవాల్లో పాల్గొంటారు. యాగశాలలో సాయంత్రం 6 గంటలకు పెరుమాళ్లను దర్శించుకొని విశ్వక్ సేనుడికి పూజ చేస్తారు. అనంతరం సమతామూర్తి కేంద్రానికి చేరుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు.

216 అడుగుల ఎత్తైన సమతామూర్తి విగ్రహానికి మోడీ.. చినజీయర్? స్వామితో కలిసి పూజ చేస్తారు. తర్వాత సమతామూర్తి విగ్రహాన్ని జాతికి అంకితమివ్వనున్నారు. అనంతరం అక్కడి నుంచే యావత్ ప్రపంచానికి మోడీ తన సందేశాన్ని ఇవ్వనున్నారు. మోడీ సమక్షంలోనే రామానుజచార్యుల విగ్రహంపై 15 నిమిషాలపాటు 3డీ లైటింగ్ ప్రదర్శిస్తారు. ఆ తర్వాత ముచ్చింతల్ ఆశ్రమం నుంచి ప్రధాని మోడీ రోడ్డు మార్గంలో శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ బయలుదేరి వెళతారు.

టూర్ షెడ్యూల్ ఇదే..

పటిష్ట బందోబస్తు..

ప్రధాని మోడీ తెలంగాణ పర్యటన సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్ సిటీలో 7వేల మంది పోలీసులతో భద్రతా చర్యలు చేపట్టారు. ఇక్రిశాట్, ముచ్చింతల్ ఆశ్రమాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రధాని భద్రతా ఏర్పాట్లకు సంబంధించి రాష్ట్ర పోలీసులతో ఎస్పీజీ అధికారులు సమన్వయం చేస్తున్నారు. ముచ్చింతల్ పరిసర ప్రాంతాల్లో కూడా ప్రత్యేక నిఘా పెట్టారు. శ్రీరామనగరంలో అత్యాధునిక కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం చేసుకోవద్దు : ప్రభుత్వ విప్ బాల్క సుమన్

మంచిర్యాల, ఫిబ్రవరి 4:: మత్తు పదార్థాలతో యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రభుత్వ విప్, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ సూచించారు. జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గం సింగరేణి ఫంక్షన్ హాల్‌లో బెల్లంపల్లి సబ్ డివిజన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణ పై అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విప్ సుమన్ మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. పెడదారి పట్టకుండా సన్మార్గంలో కొనసాగాలని, మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. తెలంగాణాలో డ్రగ్స్ మహమ్మారిని మొగ్గ దశలోనే తుంచి వేస్తామన్నారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు కాకుండా తల్లిదండ్రులు చిన్నప్పటి నుంచే పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు. మత్తు పదార్థాల నియంత్రణకు తెలంగాణ ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని వివరించారు. మత్తు పదార్థాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఉక్కు పాదంతో అణచి వేస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే పీడీ యాక్ట్ పెడతామన్నారు. జిల్లాలోని కళాశాలలు, రైల్వే స్టేషన్ లో, గ్రామాలలో రెక్కీ నిర్వహించాలని తెలిపారు. ఇలాంటి అవగాహన సదస్సులు మరెన్నో జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు పోలీసు శాఖ సమన్వయంతో పనిచేసి వార్డు, గ్రామ, పట్టణ మున్సిపాలిటీ స్థాయిలలో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఇంత మంచి కార్యక్రమం నిర్వహించిన పోలీస్ శాఖ వారికి అభినందనలు. పోలీస్ శాఖకు ప్రజా ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్, రామగుండం కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, ఏసీపీ ఎడ్ల మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

మేడారం జాతరకు కోసం కాల్ చేస్తే బస్సు పంపుతాం: సజ్జనార్

హైదరాబాద్, ఫిబ్రవరి 4: మేడారం జాతరకు టీఎస్ఆర్టీసీ అన్ని ఏర్పాట్లను చేసిందని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. 50 ఏళ్లుగా ఆర్టీసీ వేడారానికి బస్సులను నడుపుతోందన్నారు. మొదట రెండంకెల బస్సులతో 1970లో స్టార్ట్ అయ్యిందని.. ప్రస్తుతం 7వందలకు పెరిగిందన్నారు. గత ఏడాది 19లక్షలకు పైగా భక్తులను మేడారం చేర్చామన్నారు. గత ఏడాది 3వేలకు పైగా బస్సులు- 50వేలకు పైగా ట్రిప్స్ రన్ చేశామన్నారు. మేడారం జాతరను రెవెన్యూగా చూడలేదని సజ్జనార్ తెలిపారు. గత ఏడాది 30 కోట్ల రెవెన్యూ వచ్చిందన్నారు. ఈ సారి 3845 బస్సులు నడపాలని- 51 పాయింట్స్ నుంచి మేడారానికి ఆర్టీసీ బస్సులు నడుస్తాయన్నారు. ఇతర రాష్ట్రాలు మహారాష్ట్రతో పలు ప్రాంతాల నుంచి బస్సులు నడుపున్నామన్నారు. 30మంది ప్రయాణికులు ఉంటే ఈ నంబర్ 04030102829కి కాల్ చేస్తే బస్సు పంపుతామన్నారు. ప్రజలందరూ మా వెబ్ సైట్‌ను చూస్తే అన్ని సౌకర్యాలూ అందుబాటులో ఉంటాయన్నారు. ఇప్పటి వరకూ 5వందల బస్సులు 12వందల ప్రయాణికులను మేడారం చేర్చామని సజ్జనార్ వెల్లడించారు.

ఏడాదికి 15 వేల మంది క్యాన్సర్ రోగులకు ఉచితంగా చికిత్స : మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 4:ప్రభుత్వ రంగంలో పేదలకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు టీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఆరోగ్య శ్రీ కింద క్యాన్సర్ చికిత్సకు ప్రభుత్వం ప్రతి ఏడాది రూ. 100 కోట్లు ఖర్చు చేస్తోందని మంత్రి తెలిపారు. నిమ్స్, ఎంఎన్‌జే ఆస్పత్రుల్లో క్యాన్సర్ రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని తెలిపారు. ఏడాదికి 15 వేల మంది క్యాన్సర్ రోగులకు ప్రభుత్వం ఉచితంగా వైద్య సేవలు అందిస్తోందని అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో మంత్రి హరీశ్ రావు సీటీ స్కాన్, డెంటల్ ఎక్స్‌రే ఓపీజీ, పెషేంట్ అటెండెన్సీ భవనంతో పాటు మొబైల్ స్క్రీనింగ్ వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు.

14 సంవత్సరాల క్రితం ఏర్పాటైన సీటీ స్కాన్ ఏర్పాటు చేయడం లేదని చెప్పడంతో రూ. 7 కోట్ల 16 లక్షలతో అధునాతన సీటీ స్కాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. క్యాన్సర్ రోగులను గుర్తించేందుకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రూ. కోటితో అందుబాటులోకి తీసుకొచ్చిన మొబైల్ స్క్రీనింగ్ వాహనాన్ని ప్రారంభించామన్నారు. సర్వైకల్, బ్రెస్ట్, ఓరల్ క్యాన్సర్‌ను గుర్తించేందుకు ఈ వాహనం ఉపయోగపడుతుందన్నారు.

నీనారావు చారిటబుల్ ట్రస్టు ద్వారా డాక్టర్ గోవింద్ రావు రూ. 3 కోట్లతో 300 పడకల పేషెంట్ అటెండెన్సీ భవనాన్ని నిర్మించారు. ఈ భవనం ఈ రోజు నుంచి అందుబాటులోకి వస్తుంది. ఇక్కడ రూ. 5 భోజన సౌకర్యం కల్పిస్తాం. రూ. 40 లక్షలతో డెంటల్ ఎక్స్‌రే ఓపీజీని ప్రారంభం చేసుకున్నామని తెలిపారు.

ఈహెచ్ఎస్, సింగరేణి, ఆర్టీసీ ఉద్యోగులతో పాటు ఇతర ఉద్యోగుల అవసరాల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ. 3 కోట్లతో నిర్మించిన 24 గదుల స్పెషల్ బ్లాక్‌ను ప్రారంభించామని మంత్రి హరీశ్‌రావు తెలిపారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎంఎన్‌జే క్యాన్సర్ బడ్జెట్‌ను సీఎం కేసీఆర్ రెట్టింపు చేశారని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఈ ఆస్పత్రికి 252 పోస్టులను కొత్తగా మంజూరు చేశారు. 32 మంది డాక్టర్లు 85 మంది స్టాఫ్‌నర్సులు, 85 మంది టెక్నిషీయన్లను మంజూరు చేశాం. రోగులు పెరుగుతున్న నేపథ్యంలో అరబిందో ఫార్మా వారు సీఎస్ఆర్ ప్రోగ్రాం కింద రూ. 65 కోట్లతో 300 పడకలతో కొత్తగా ఆస్పత్రిని నిర్మిస్తున్నారు. ఇది ఏప్రిల్ నెలలోగా అందుబాటులోకి రానుంది. ప్రస్తుతమున్న 450 బెడ్స్‌కు అదనంగా ఈ 300 బెడ్స్ వస్తే 750 పడకలకు అప్‌గ్రేడ్ చేసుకోబోతామని మంత్రి తెలిపారు. ఎంఎన్‌జేకు సమీపంలోని రెండు, మూడు ఎకరాల స్థలాన్ని కూడా క్యాన్సర్ హాస్పిటల్‌కు అందించాలని కోరారు. ఆ స్థలాన్ని ఎంఎన్‌జే ఆస్పత్రికి కేటాయిస్తామని తెలిపారు.

మార్చి నెలఖారులోగా అందుబాటులోకి రోబోటిక్ థియేటర్

ఎంఎన్‌జేలో ప్రస్తుతం 3 ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయి. ఏడాదికి 4000 మైనర్ సర్జరీలు, 1500 మేజర్ సర్జరీలు చేస్తున్నారు. రూ. 15 కోట్లతో 8 అధునాతన ఆపరేషన్ థియేటర్లను నిర్మించబోతున్నాం. ఈ పనులు వేగంగా జరుగుతున్నాయి. మార్చి నెలఖారులోగా ఈ థియేటర్లు అందుబాటులోకి రానున్నాయి.

ఇందులో ఒకటి రోబోటిక్ థియేటర్ అందుబాటులోకి రానుంది. దీంతో 5 వేల వరకు సర్జరీలు చేసే అవకాశం ఉంది అని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు.

ప్రపంచాన్ని క్యాన్సర్ పట్టిపీడిస్తోంది..

క్యాన్సర్ మహమ్మారి ఈ దేశాన్ని, ప్రపంచాన్ని పట్టిపీడిస్తోంది. క్యాన్సర్‌ను నిర్మూలించేందుకు చాలా పరిశోధనలు జరుగుతున్నాయి. క్యాన్సర్ ట్రీట్‌మెంట్ చికిత్సా విధానాలు మెరుగు అవుతున్నాయి. వైద్యులు ఎన్నో నూతన వైద్య విధానాలతో క్యాన్సర్ రోగులను బతికిస్తున్నారు. ప్రపంచ, దేశ వ్యాప్తంగా క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరిగుతూ పోతోంది. 100 రకాల క్యాన్సర్లను ఇప్పటి వరకు గుర్తించారు. ప్రతి ఏటా కూడా ఈ సంఖ్య బాగా పెరుగుతుంది. గత 30 ఏండ్లలో 50 శాతం క్యాన్సర్ కేసులు పెరిగినట్లు తెలుస్తోంది. ఆహారపు అలవాట్లు, జీవనశైలి, గుట్కా మద్యపానం, పొగాకు వల్ల కూడా క్యాన్సర్ సంభవిస్తోంది. జన్యుపరంగా కూడా ఈ వ్యాధి సంక్రమిస్తున్నట్లు తేలింది. ఆహారపు అలవాట్లు, జీవనశైలిని మార్చుకోవడం ద్వారా క్యాన్సర్‌ను నిరోధించొచ్చు అని అధ్యయనాల్లో తేలింది అని హరీశ్‌రావు చెప్పారు.

గుట్కా, సిగరెట్‌కు దూరంగా ఉండాలి..

పదేండ్ల వయసు నుంచే బీడీ, సిగరెట్ తాగడంతో తనకు ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చింది అని ఓ రోగి తెలిపినట్లు హరీశ్‌రావు మీడియా సమావేశంలో వెల్లడించారు. తనకు ఓ బిడ్డ ఉంది. ఇప్పుడు మేం రోడ్డున పడ్డాం. చిన్న వయసులోనే బీడీలు, సిగరెట్ తాగానని బాధపడుతున్నాడు. బీడీలు, సిగరెట్లు తాగి పెద్ద తప్పు చేశానని అతను బాధపడినట్లు హరీశ్‌రావు తెలిపారు.

40 ఏండ్లు దాటిన వారందరికీ స్క్రీనింగ్ నిర్వహిస్తాం..

క్యాన్సర్ పట్ల ప్రజల్లో చైతన్యం, అవగాహన పెరగాలి అని హరీశ్‌రావు అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రతి పీహెచ్‌సీ స్థాయిలో క్యాన్సర్ స్క్రీనింగ్ చేస్తున్నాం.

ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే నివారించొచ్చు. వైద్యారోగ్య సిబ్బందిని కూడా ట్రైన్ చేయబోతున్నాం. 40 ఏండ్లు దాటిన వారందరికీ స్క్రీనింగ్ నిర్వహించాలని నిర్ణయించాం. దీన్ని త్వరలోనే అమలు చేస్తామన్నారు. క్యాన్సర్‌పై ప్రజల్లో లోతైన అవగాహన కల్పిస్తున్నాం. నోటి, గొంతు క్యాన్సర్లతో పాటు బ్రెస్ట్, గర్భాశయ క్యాన్సర్లు వస్తున్నాయి. క్యాన్సర్‌ను నివారించడానికి, ప్రజల్లో అవగాహన తెచ్చేందుకు ప్రత్యేకమైన కార్యక్రమాలు చేపడుతామని మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు.

ఏ పల్లెల్లోనైనా తెలంగాణ వంటి అభివృద్ధిని చూపిస్తారా : కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 4:ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తున్న ఏకైక ప్రభుత్వం టీఆర్ఎస్ ప్రభుత్వమేనని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లోని ఏ పల్లెల్లోనైనా.. ఎక్కడైనా.. తెలంగాణ వంటి అభివృద్ధిని చూపిస్తారా..తెలంగాణ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. శుక్రవారం మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండలం కోడ్గల్ లో మంత్రి కేటీఆర్ పర్యటించారు. ఈసందర్భంగా 40 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన రైతు వేదికలో ఆయన మాట్లాడుతూ స్వతంత్రం వచ్చిన తర్వాత దేశంలోని ఏ రాష్ట్రంలోనూ ఇంత త్వరగా అభివృద్ధి పనులు జరగలేదన్నారు.

అరవై ఏండ్ల కాలంలో ఎంతో మంది సీఎంలు వచ్చి తెలంగాణ కోసం చేసిందేమి లేదని, ప్రస్తుతం సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం.. అభివృద్ధి, సంక్షేమం దిశగా దూసుకుపోతోందన్నారు. వృద్ధుల కు పింఛన్లు, ఆడపిల్లల పెళ్లికి లక్ష రూపాయలు ఇచ్చి తల్లిదండ్రుల ఆత్మగౌరవాన్ని కాపాడారని మంత్రి కేటీఆర్ అన్నారు. కేసీఆర్ కిట్ల వల్లే ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పులు పెరిగాయన్నారు. మొన్న బడ్జెట్ తర్వాత సీఎం కేసీఆర్ ఆవేదనతో.. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వమని అడిగితే కేంద్ర ప్రభుత్వం నుంచి ఉలుకు పలుకూ లేదన్నారు. కేంద్రం కలసి వచ్చినా రాకపోయినా.. మీ ఆశీర్వాదంతో సీఎం కేసీఆర్ ప్రభుత్వం వెనకడుగు వేయలేదు.. వేయదని కేటీఆర్ అన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి.. మంత్రులు శ్రీనివాస్ గౌడ్.. నిరంజన్ రెడ్డిలు పాల్గొన్నారు

సింగరేణిలో1000 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రతిపాదన : సీఎండీ శ్రీధర్

హైదరాబాద్, ఫిబ్రవరి 4:సింగరేణి సంస్థ ఇప్పటికే 219 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌ణు ఏర్పాటు చేసి సమర్థవంతంగా నిర్వహిస్తుండగా.. మరో 1000 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయాలనే యోచనలో ఉన్నది. ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు ప్రభుత్వానికి అంద జేయాలని సింగరేణి సీఎండీ శ్రీధర్ సోలార్ విభాగం ఉన్నతాధికారులను ఆదేశించారు.

గురువారం సింగరేణి భవన్‌లో సింగరేణి థర్మల్, సోలార్ ప్రాజెక్టులపై డైరెక్టర్ సత్యనారాయణరావుతో కలిసి సమీక్ష నిర్వహించారు. దేశంలో బొగ్గు ఉత్పత్తితో పాటు సోలార్, థర్మల్ విద్యుత్ రంగాల్లో అడుగుపెట్టిన తొలి ప్రభుత్వ బొగ్గు ఉత్పత్తి సంస్థగా సింగరేణి ఖ్యాతికెక్కిందని, ఈ నేపథ్యంలో మరో వెయ్యి మెగావాట్ల సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు తగు అధ్యయనం చేసి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి లభిస్తే రాష్ట్ర వ్యాప్తంగా కేటాయించే నిరూపయోగ, ఖాళీ స్థలాల్లో సోలార్ ప్లాంట్‌ను దశల వారిగా ఏర్పాటు చేయడం జరుగు తుందన్నారు. సింగరేణి సోలార్‌లో 3వ దశలోని 66 మెగావాట్ల ప్లాంట్లను ఏప్రిల్ నెలలోగా టెండర్లు పూర్తి చేయాలని, మే నుంచి పనులు ప్రారం భించాలన్నారు. సింగరేణిలో ఏర్పాటు చేసిన 219 మెగావాట్ల సోలార్ ప్లాంట నుంచి ఇప్పటి వరకు 21.29 కోట్ల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అయిందన్నారు. సింగరేణి విద్యుత్ ఖర్చుల్లో సంస్థకు రూ.65.27 కోట్ల మేర ఆదా చేకూరిందని వివరించారు. గడిచిన ఐదు నెలలల్లో వరరుసగా 90శాతం పైగా పీఎల్ఎఫ్‌ను సాధిస్తూ దేశంలోనే వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ప్లాంట్లలో సింగరేణి నంబర్‌వన్ స్థానంలో నిలిచిందన్నారు.

నకిలీ సమాజ్‌వాదీలతో జాగ్రత్త : మోదీ హెచ్చరిక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ఉత్తర ప్రదేశ్ శాసన సభ ఎన్నికల్లో ఓటర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హెచ్చరించారు. నకిలీ సమాజ్‌వాదీలు అధికారంలోకి వస్తే, ప్రజలను ఆకలితో ఉంచుతారని, రైతులకు అందిస్తున్న సాయాన్ని నిలిపేస్తారని చెప్పారు. శుక్రవారం ఆయన వర్చువల్ విధానంలో రచ్చబండలో మాట్లాడారు.

ఉత్తర ప్రదేశ్ శాసన సభ ఎన్నికల్లో తొలి దశలో ఫిబ్రవరి 10న పోలింగ్ జరిగే పశ్చిమ ఉత్తర ప్రదేశ్ ప్రజలను ఉద్దేశించి మోదీ మాట్లాడారు. అల్లర్లకు పాల్పడేవారు, మాఫియా గ్యాంగులు రాష్ట్రంపై పట్టు సాధించేందుకు అనుమతించరాదని ప్రజలు నిర్ణయం తీసుకున్నందుకు తనకు చాలా సంతోషంగా ఉందన్నారు.

"ఓటు వేసేటపుడు మీరు చాలా జాగ్రత్తగా ఉండవలసిన అవసరం ఉంది. ఈ కుటుంబ నాయకత్వంలోని నకిలీ సమాజ్‌వాదీలకు అవకాశం వస్తే, రైతులకు అందుతున్న సాయాన్ని నిలిపేస్తారు. ఈ నకిలీ సమాజ్‌వాదీలు మిమ్మల్ని ఆకలితో ఉంచుతారు'' అని మోదీ హెచ్చరించారు. భద్రత, గౌరవం, సౌభాగ్యాలను కొనసాగించడానికి; హిస్టరీ షీటర్లను బయట ఉంచడానికి, నూతన చరిత్రను సృష్టించడానికి ఈ ఎన్నికలు జరుగుతున్నాయన్నారు.

డబుల్ ఇంజిన్-డబుల్ బెనిఫిట్స్‌యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఉత్తర ప్రదేశ్‌లో శాంతిభద్రతలను కాపాడుతోందన్నారు. రాష్ట్రంలో చట్టం అమలయ్యేలా యోగి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. నేరగాళ్ళు అదుపులోకి వస్తారని ఎవరూ ఊహించలేదన్నారు. రెట్టింపు వేగంతో పని చేయగలిగే ప్రభుత్వం 21వ శతాబ్దంలో ఉత్తర ప్రదేశ్‌కు అవసరమని, కేవలం డబుల్ ఇంజిన్ గవర్నమెంట్ మాత్రమే ఆ పని చేయగలదని అన్నారు.

ఈ ఎన్నికలు ప్రత్యేకమైనవిస్వాతంత్ర్యానంతరం అనేకసార్లు ఎన్నికలు జరిగాయని, ప్రస్తుత ఎన్నికలు చాలా ప్రత్యేకమైనవని తెలిపారు. రాష్ట్రంలో శాంతి స్థాపన, అభివృద్ధి కొనసాగింపు, సుపరిపాలన, ప్రజలు వేగంగా అభివృద్ధి చెందడం కోసం ఈ ఎన్నికలు జరుగుతున్నట్లు చెప్పారు.

సంక్షోభ సమయంలో సైతం...100 ఏళ్ళలో మానవాళి ఎరుగని విపత్తు కోవిడ్-19 రూపంలో వచ్చిందన్నారు. ఈ సంక్షోభ సమయంలో సైతం తాము డబుల్ ఇంజిన్ డబుల్ బెనిఫిట్స్‌ను ప్రజలకు అందేలా చేశామని చెప్పారు.

మీరట్, ఘజియాబాద్, అలీగఢ్, హాపూర్, నోయిడా జిల్లాల ఓటర్లను ఉద్దేశించి ఈ వర్చువల్ రచ్చబండను బీజేపీ నిర్వహించింది.



జడ్ సెక్యూరిటీ వద్దు.. సామాన్యులకు భద్రత కల్పించినప్పుడే నాకు ఇవ్వండి: ఒవైసీ

హైదరాబాద్, ఫిబ్రవరి 4:ఎఐఎంఐం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తనకు కేంద్ర కేటాయించి జడ్డ సెక్నయూరిటీని తిరస్కరించారు. కారుపై కాల్పుల ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరపాలని, నిందితులపై టెర్రర్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. సామాన్య ప్రజలకు భద్రత కల్పించినప్పుడే తనకూ భద్రత కావాలని ఇవ్వాల పార

సామాజిక అసమానతలను చెరిపేద్దాం..!

గత రెండేళ్లుగా విశ్వ మానవాళి కరోనా విషవలయ అలల్లో చిక్కి ఉచ్ఛ్వాస నిశ్వాసలు తీసుకోవడానికి సహితం భయపడుతున్నది. కోవిడ్-19 విజృంభనతో ప్రజారోగ్యం, విద్య, ఆహార భద్రత, అసంఘటిత రంగాలు విధ్వంసం అవుతున్నాయి. ఇండియాలోని ప్రజాసమస్యల్లో అధిక జనాభా, నిరక్షరాస్యత, నిరుద్యోగం లాంటి ప్రధాన అంశాలతో పాటు జీవన ప్రమాణాలు, మానవ వనరుల అభివృద్ధి రంగాల్లో నిరాశాజనక పరిస్థితులలో ఉన్నది. ఇటీవల వివిధ జాతీయ అంతర్జాతీయ సంస్థలు నిర్వహించి అధ్యయనాల్లో అభాగ్య భారత భవిత బట్టబయలైంది. ఆక్స్‌ఫామ్ నిర్వహించిన 'ఇనిక్వాలిటీ కిల్స్' సర్వే ప్రకారం దేశ ఆర్థిక ప్రగతి ఆంగ్ల అక్షరం 'కె'-ఆకృతిలో కదులుతూ, పేదలు నిరుపేదలుగా మారడమే కాకుండా ధనికులు అత్యంత ధనికులుగా మారుతూ ఆర్థిక అసమానతలు పెరగడం గమనించారు. 2016 నుంచి దేశంలో నిరుద్యోగం పెరగడమే కాకుండా శ్రామికవర్గాల వేతనాలు పెరగకుండా స్తబ్దత దశకు చేరడం పెను ప్రమాద సూచికగా కనిపిస్తున్నాయి. "గ్లోబల్ హంగర్ ఇండెక్స్" వివరాల ప్రకారం 116 దేశాల జాబితాలో భారత్‌కు 101వ స్థానం లభించడం దేశంలోకి బడుగుల ఆకలిని సూచిస్తున్నది. మానవ అభివృద్ధి సూచికలో 189 దేశాల జాబితాలో ఇండియా 131వ స్థానం పొందడం దేశ వెనుకబాటును వివరిస్తున్నది.

అధిక జనాభా, పేదరికం విస్తరించిన దేశంలో వైద్యం, విద్య, ఉద్యోగ ఉపాధి లాంటి సామాజిక రంగాలకు (సోషల్ సెక్టార్స్) ప్రభుత్వ యంత్రాంగం పెద్ద పీట వేయడం కనీస బాధ్యతగా భావించాలి. ప్రభుత్వ పథకాలు, బడ్జెట్ కేటాయింపులు సామాజిక రంగాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో మానవ వనరుల అభివృద్ధి, ఉద్యోగ ఉపాధులు, నిరుపేదల ఆర్థిక ప్రగతి, ఆకలిని తరిమి వేయడం లాంటి ముఖ్య ప్రయోజనాలు కలుగుతాయి. ప్రతి ఏట కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులు ఇలాంటి సామాజిక రంగాలకు పెద్ద పీట వేయడంతో అసమానతలు తగ్గడం, శాంతియుత సమాజం స్థాపన జరగడం చూస్తాం.

విద్యారంగం:

కరోనా వైరస్‌తో లాక్‌డౌన్, కర్ఫ్యూ, కరోనా క్రమశిక్షణల నడుమ విద్యాలయాల మూసి వేతతో పేద పిల్లల చదువులకు దీర్ఘకాలం (ఆన్‌లైన్/ఆఫ్‌లైన్) బ్రేకులు పడ్డాయి. ఈ విపత్కర పరిస్థితులకు విరుగుడుగా నేడు కేంద్ర ప్రభుత్వం 'ఒక తరగతి, ఒక టివీ ఛానెల్ (వన్ క్లాస్, వన్ టివీ ఛానెల్)' ఫథకాన్ని ప్రకటించడం ముదావహం. 'పియం ఈ-విద్య' పథకం కింద ప్రస్తుత 12 చానెల్స్ స్థానంలో 200 చానెల్స్ రానున్నాయి. డిజిటల్ యూనివర్సిటీ ప్రతిపాదనలు కూడా చేయడం మరో విశేషంగా పేర్కొనవచ్చు. విద్యాలయాల్లో ఉపాధ్యాయుల కొరత, శాస్త్రసాంకేతిక వనరుల లేమి, డ్రాప్ అవుట్‌ల సంఖ్య పెరగడం లాంటి తీవ్ర సమస్యలకు సరైన సమాధానంగా తరగతి గదులను సాంకేతిక ఉపకరణాలతో అలంకరించనున్నారు. గత సంవత్సర (2021-22) బడ్జెట్‌లో పాఠశాల విద్యకు ? 54,873 కోట్లు కేటాయించగా, 2022-23 బడ్జెట్‌లో ? 63, 449 కోట్లు మాత్రమే కేటాయించడం కొంత విస్మయాన్ని కలిగిస్తున్నది. మద్యాహ్న భోజన 'పియం పోషన్' పథకానికి గత ఏడాది ? 11,500 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది పడ్జెట్‌లో ? 10,233 కోట్లు మాత్రమే కేటాయించడం కొంత నిరాశకు కారణం అయ్యింది. సమగ్ర శిక్షా అభియాన్ పథకానికి 2022-23లో ? 37,383 కోట్లు (గత ఏడాది కన్న ? 6,000 కోట్లు అధికంగా) కేటాయించారు.

వైద్య రంగం:

కరోనా మహమ్మారి కల్లోలంలో దేశ వైద్యరంగం ప్రజల ప్రాణాలను కాపాడటంలో 'ఫ్రంట్‌లైన్ వారియర్స్'గా అవిశ్రాంత అమూల్య సేవలను అందించారు. 2వ వేవ్ సమయంలో దేశ వైద్య ఆరోగ్య రంగం లోటు పాట్లు తేటతెల్లం అయ్యాయి. వైద్య రంగానికి గత ఏడాది ? 74,602 కోట్ల (సవరించిన అంచనాల ప్రకారం ? 85,915 కోట్లు) కేటాయింపులు జరుగగా ఈ ఏడాది ? 86,606 కోట్లు మాత్రమే కేటాయించడం సముచితంగా లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రజారోగ్య సమస్యలకు ప్రధాన కారణాలుగా సురక్షిత నీరు, పరిసరాల పరిశుభ్రత, మారుమూల ప్రాంతాలకు కూడా వైద్య వసతుల విస్తరణ లాంటి సౌకర్యాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిందే. గత ఏడాది సురక్షిత నీటి వనరుల 'జల్ జీవన్ మిషన్'కు కేటాయించిన నిధుల్లో డిసెంబర్-2021 వరకు 44 శాతం మాత్రమే వినియోగించడం ఆశ్చర్యకరం. గత ఏడాది ? 50,000 కోట్ల కేటాయింపులు జరుగగా, 2022-23లో ? 60,000 కోట్ల నిధులు వెచ్చించనున్నారు.

ఆహార భద్రత:

గత ఏడాది వ్యవసాయ రంగానికి ?1,26,807 కోట్ల కేటాయింపులతో పోల్చితే 2022-23 ఏడాదిలో 4.4 శాతం నిధులు పెంచుతూ ? 1,32,514 కోట్ల బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. జాతీయ ఆహార భద్రత చట్టం పరిధిలోకి 60 శాతం జనాభా రావడం, ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ పొందడం జరుగుతున్నది. ఆహార భద్రత నిమిత్తం గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ? 73,000 కోట్ల పరిమితమైన నిధులను మాత్రమే వెచ్చించనున్నారు.

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో సామాజిక రంగాలకు ఇవ్వవలసినంతగా ప్రాధాన్యత ఇవ్వలేదని బడ్జెట్ కేటాయింపులు స్పష్టం చేస్తున్నాయి. కోవిడ్-19 మిగిల్చిన విషాదాలను, కరోనా సంక్షోభాలను తట్టుకొని సామాన్య భారతీయుడు ధైర్యంగా నిలబడటానికి కావలసినంత ఊతాన్ని ప్రభుత్వాలు భుజాన వేసుకోవాలి.

కుటుంబాల కనీస అవసరాలైన రోటీ, కపడా, మకాన్ (కూడు, గుడ్డ, గూడు)లకు అధిక ప్రాముఖ్యతను ఇవ్వాల్సిందే. వీటితో పాటు ప్రజారోగ్యం, విద్య, పోషకాహారం, సామాజిక భద్రత, అసమానతల తొలగింపు వంటి రంగాలను నిర్లక్ష్యం చేయరాదు. ఈ అంశాలకు పట్టం కట్టని ఏ బడ్జెట్ కేటాయింపులు అయినా అసంతృప్తికరంగానే ఉంటాయి. భారత దేశంలో సామాజిక రక్షణకు కేటాయింపులు జిడిపిలో 1.4 శాతం మాత్రమే ఉండడం కూడా మన బలహీనత అని గుర్తించాలి. సాధారణ అల్పాదాయ దేశాల్లో సగటు సామాజిక రక్షణ కేటాయింపులు జిడిపిలో 2.5 శాతం వరకు ఉండడం గమనించారు. ప్రజారోగ్యానికి జిడిపిలో 3 శాతం, విద్యకు 6 శాతం నిధులు కేటాయించాలి. సామాజిక రంగాలను విస్మరిస్తూ అన్ని వర్గాల ప్రజల మేలును కోరుకోవడం హాస్యాస్పదమే అవుతుంది. అన్నం దొరక్క తల్లడిల్లే అస్థిపంజరాలు ఒక వైపు, స్థూలకాయ సమస్యతో బాధ పడుతున్న మహారాజులు మరో వైపు అసమానతల నదికి ఇరువైపుల తీరాల్లో నిలబడి ఉండడం విచిత్రంగా తోస్తున్నది. అన్ని వర్గాల ప్రజలను, ముఖ్యంగా బడుగుల బతుకులను కాపాడుతూ సాధారణ జనజీవన స్రవంతిలో కలుపుకోవలసిన అగత్యం ప్రభుత్వాలకు, పౌరసమాజానికి ఉందని మరువరాదు. అల్పాదాయ వర్గాల ప్రజలు సమగ్రాభివృద్ధి దిశగా అడుగులు వేసినపుడే అసమానతలు తగ్గిపోయి సమసమాజ స్థాపన జరుగుతుందనడంలో అతిశయోక్తి లేదు. వ్యవసాయ/ అనుబంధ వర్గాల కూలీలు, గ్రామీణ వృత్తి కళాకారులు, పారిశ్రామిక కార్మికులు, అసంఘటిత రంగాల బడుగులు ముందడుగు వేస్తేనే భారత దేశం శోభాయమానంగా వెలుగులు విరజిమ్ముతుందని మరువరాదు.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

పైలెట్ల కొరతను పరిష్కరించేందుకు తీసుకున్న చర్యలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:దేశంలో పైలెట్ల కొరతను పరిష్కరించేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంది. ఇందులో దిగువన పేర్కొన్న అంశాలు ఉన్నాయిః

ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ) సరళీకృత ఫ్లైయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌టిఒ) విధానాన్ని తీసుకువచ్చింది. ఇందులో భాగంగా ఎయిర్‌పోర్ట్ రాయల్టీ (ఎఫ్‌టిఒలు ఎఎఐకి చెల్లించే రెవిన్యూ వాటా)ను రద్దు చేయడమే కాక భూమి కిరాయిని చెప్పుకోదగినంతగా హేతుబద్ధం చేశారు.

ఐదు విమానాశ్రయాలు) బెళగావి (కర్ణాటక) లో రెండు, జల్గాంవ్ (మహారాష్ట్ర)లో రెండు, కలబురగి (కర్ణాటక)లో రెండు, ఖజురాహో (మధ్యప్రదేశ్)లో రెండు, లీలాబారీ (అస్సాం)లో ఒకటితో కలిపి మొత్తం తొమ్మిది ఎఫ్‌టిఒలను ఏర్పాటు చేసేందుకు 31 మే 2021న, 29 అక్టోబర్ 2021న ఎఎఐ కేటాయింపు లేఖలను జారీ చేసింది.

డిజిసిఎ విమాన నిర్వహణ ఇంజినీర్లు (ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజినీర్స్ -ఎఎంఇ) ఫ్లైయింగ్ క్రూ (ఎఫ్‌సి) అభ్యర్థులకు ఆన్‌లైన్ -ఆన్ డిమాండ్ పరీక్ష (ఒఎల్‌ఒడిఇ)ని డిజిసిఎ ప్రవేశపెట్టింది. అందుబాటులో ఉన్న పరీక్ష స్లాట్లను బట్టి అభ్యర్థులు తేదీని, సమయాన్ని ఎంచుకునే అవకాశాన్ని ఇది అందిస్తుంది.

ఎఫ్‌టిఒలలో వైమానిక కార్యకలాపాలకు ఉత్తర్వులిచ్చే హక్కుతో ఫ్లైయింగ్ ఇనస్ట్రక్టర్లను సాధికారం చేసేందుకు డిజిసిఎ తన నిబంధనలను సవరించింది. కాగా, దీనిని చీఫ్ ఫ్లైయింగ్ ఇనస్ట్రక్టర్ (సిఎఫ్ఐ), లేదా డిప్యూటీ సిఎఫ్ఐలకు మాత్రమే పరిమితం చేసింది.

భారత దేశంలోని అమేథీలో (ఉత్తర్‌ప్రదేశ్) అతిపెద్ద ఫ్లైయింగ్ అకాడమీ - ఇందిరాగాంధీ రాష్ట్రీయ ఉడాన్ అకాడమీ (ఐజిఆర్‌యుఎ)కి గోండియా (మహారాష్ట్ర), కలబురగి (కర్ణాటక)లో పైలెట్ శిక్షణను ఇచ్చేందుకు అనుమతించారు. తద్వారా తన ఫ్లైయింగ్ అవర్స్‌ను, విమాన వినియోగాన్ని పెంచడానికి అవకాశం ఏర్పడుతుంది. సాధారణంగా, శీతాకాలంలో దృష్టిగోచరత తక్కువగా ఉన్నందున తీవ్రంగా ఇవి ప్రభావితం అవుతాయి. ఐజిఆర్‌యుఎ వారాంతాలు, అన్ని శలవల్లో కార్యకలాపాలను ప్రారంభించింది. కేవలం 2021వ సంవత్సరంలో 19,019 ఫ్లైయింగ్ అవర్స్‌ను పూర్తి చేసింది. ఇది కోవిడ్ ముందస్తు ఏడాది 2019లోని 15,137 గంటలతో పోలిస్తే 25% ఎక్కువ. భారతీయ ఎఫ్‌టిఒలు 2021లో ఉత్పత్తి చేసిన సిపిఎల్ హోల్డర్ల సంఖ్య 504గా ఉంది. ఇది కోవిడ్ ముందస్తు ఏడాది 2019లో భారతీయ ఎఫ్‌టిఒలు తయారు చేసిన 430 సిపిఎల్‌తో పోలిస్తే అధికం. ఈ సమాచారాన్ని పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి జనరల్ (డాక్టర్). వి.కె. సింగ్ (రిటైర్డ్) నేడు లోక్‌సభలో అడిగిన ఒక ప్రశ్నకు లిఖిత పూర్వకంగా ఇచ్చిన సమాధానంలో వెల్లడించారు.

నీట్ పీజీ పరీక్ష వాయిదా - కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:ఢిల్లీ నీట్ పీజీ పరీక్షని కేంద్రం వాయిదా వేసింది. నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)-2022 పీజీ పరీక్షను వాయిదా వేస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 6 నుంచి 8 వారాల పాటు ఎగ్జామ్ ను పోస్ట్ పోన్ చేస్తున్నట్లు వెల్లడించింది. అయితే షెడ్యూల్ ప్రకారం మార్చి 12 నిర్వహించాలని నిర్ణయించగా.. ప్రస్తుతం దీన్ని వాయిదా వేశారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఇంటర్న్ షిప్ కు సంబంధించి ఓ కేసు విచారణలో ఉంది. పీజీ పరీక్ష వాయిదా? ఇంటర్న్ షిప్ కు సంబంధించి విచారణ ముందుగా సుప్రీం కోర్టులో ఫిబ్రవరి 7న విచారించాల్సి ఉంది.

అయితే దీన్ని ఈరోజున విచారించేందుకు సుప్రీం కోర్టు అంగీకరించింది. దీంతో ఈ అంశం విచారణకు రాకముందే కేంద్రం నీట్ పీజీ ఎగ్జామ్ ను వాయిదా వేసింది. కరోనా కారణంగా వందలాది మంది ఎంబీబీఎస్ విద్యార్థులు తమ ఇంటర్న్ షిప్ ను పూర్తి చేయలేకపోయారు. దీంతో మార్చి 12న పీజీ పరీక్షకు ఇంటర్న్ షిప్ పూర్తి చేయని వారు అనర్హులు. ఈ నేపథ్యంలో పరీక్షను వాయిదా వేయాలని ఆరుగురు విద్యార్థులు ఈ అంశంపై సుప్రీం ను ఆశ్రయించారు.

విద్యార్థులతో కలిసి మంత్రి కేటీఆర్ సహపంక్తి భోజనం

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 4:: తిమ్మాజిపేట మండల కేంద్రంలో నూతన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాన్ని ప్రారంభించిన అనంతరం మంత్రి కేటీఆర్ పాఠశాల విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కేటీఆర్ ముచ్చటించారు.

తిమ్మాజిపేటలో ఎంజేఆర్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో అధునాతన సదుపాయాలతో నూతనంగా నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్థానిక ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డితో కలిసి మంత్రులు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి, నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. అందరం పుడుతాం.. మనకాలపరిమితి ముగిశాక నిష్క్రమిస్తాం. పది మందికి ఉపయోగపడే పనులు చేస్తేనే చిరస్థాయిగా గుర్తుండిపోతాం. ఎమ్మెల్యే జనార్దన్ రెడ్డి వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. ఎంతో కష్టపడి జీవితంలో పైకి వచ్చారు. రాష్ట్రంలోనే ఒక వేలాది మందికి ఉద్యోగాలు కల్పించే పరిశ్రామికవేత్తగా ఎదిగారు. అంతేకాకుండా తనకు జన్మనిచ్చిన ప్రాంతాన్ని మరిచిపోకుండా, పుట్టిన గడ్డ రుణం తీర్చుకున్నారు. కార్పొరేట్ పాఠశాలల కంటే ఈ స్కూల్ బాగుంది. ప్రధానోపాధ్యాయుడి చాంబర్, టీచర్ల స్టాఫ్‌రూమ్, పిల్లలకు ల్యాబ్స్, భోజనశాల, గ్రౌండ్ అద్భుతంగా ఉన్నాయి. ఇంత మంచి వాతావరణం ఏ కార్పొరేట్ పాఠశాలలో కూడా లేదు. పుట్టినగడ్డ రుణం తీర్చుకోవడానికి ఒక విద్యాలయానికి నిధులు సమకూర్చిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. రూ. 7289 కోట్లతో 26 వేల పాఠశాలలను మన ఊరు మన బడి కార్యక్రమంతో తీర్చిదిద్దుతున్నాం. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

పథకాల అమలులో ఎందుకింత వివక్ష?: టీఆర్ఎస్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:తెలంగాణ రాష్ట్రం భారతదేశంలో లేదా? అక్కడి ప్రజలు భారతీయులు కారా? ప్రజా సంక్షేమానికి సంబంధించిన కీలక పథకాల్లో కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై ఎందుకంత వివక్ష చూపుతోందని టీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు నామా నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే సందర్భంగా గురువారం కేంద్రం తెలంగాణ రాష్ట్రం పట్ల వ్యవహరిస్తున్న తీరును ఆయన ఎండగట్టారు. విభజన హామీలు, ఆహార ధాన్యాల సేకరణలో జాతీయ విధానం తీసుకురావాలని, రైతులకు సంబంధించిన కీలక అంశమైన కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలపై రాష్ట్రపతి ప్రసంగంలో ఎలాంటి ప్రస్తావనా లేదనీ అన్నారు.

అంబేద్కర్ దేశ ప్రజలకు అందించిన స్వేచ్ఛ, సమానత్వం, సమగ్రత అంశాలను సమైక్య నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వం నాశనం చేసిందన్నది వాస్తవమని ఎంపీ నామా విమర్శించారు. కోవిడ్‌తో పాటు దేశం అనేక సమస్యలను ఎదుర్కొంటోందని, ఉపాధి కల్పన లేక నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని, కనీసం మద్దతు ధర లేక రైతులు అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణా ఏర్పడక ముందు పరిస్థితులను ప్రస్తావించిన నామా? స్వరాష్ట్రం సిద్ధించాక ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంటింటికీ తాగు నీరు అందించారన్నారు. కేంద్రం ప్రశంసలు కురిపిస్తోందే తప్ప ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదని నామా నాగేశ్వరరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. నీతి అయోగ్ సిఫారసుల మేరకు మిషన్ భగీరథకు రూ .19,205 కోట్లు, కాకతీయుల కాలం నాటి చెరువుల అభివృద్ధికి రూ. 5 వేల కోట్లు చొప్పున రెండిటికీ కలిపి 24 వేల కోట్ల రూపాయలు ఇవ్వాలని 2016లో నీతిఆయోగ్ సిఫారసు చేసినా ఫలితం శూన్యమని వాపోయారు.

రాబోయే రోజుల్లోనైనా ధాన్యం సేకరణకు జాతీయ పాలసీని తీసుకురావాలని నామా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. రైతు బంధు పథకం, 24 గంటల నాణ్యమైన విద్యుత్ ద్వారా అన్నదాతలకు చేయూతనందిస్తున్నామని వెల్లడించారు. పామాయిల్ సాగులో తెలంగాణా నంబర్ వన్‌గా ఉందని, తన నియోజకవర్గంలో రెండు పామాయిల్ ఫ్యాక్టరీలు ఉన్నాయని, కొత్తగా మరో 20 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగును ప్రోత్సహించనున్నామని ఎంపీ నామా కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. 12 పామాయిల్ ఫ్యాక్టరీల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించామనీ వెల్లడించారు. కల్యాణ లక్ష్మి,

షాదీ ముబారక్, రైతుబంధు, ఇంటింటికీ తాగునీరు వంటి బృహత్తర పథకాలను దేశవ్యాప్తంగా అమలుచేయాలని డిమాండ్ చేశారు. పత్తి ఉత్పత్తిలో దేశంలో రెండో స్థానంలో ఉన్న తెలంగాణ రాష్ట్రంలో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.

ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేయాల్సిన బయ్యారం ఉక్కు పరిశ్రమ, గిరిజన యూనివర్సిటీకి నిధుల మంజూరు, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయలేదని కేంద్రానికి వివరించారు. దేశవ్యాప్తంగా 157 మెడికల్ కాలేజీలు, 7 ఐఐఎం, 7 ఐఐటీలు, 16 ట్రిపుల్ ఐటీలు, 84 నవోదయ విద్యాలయాలు, 4 ఎస్ఐటీ మంజూరు చేసినా తెలంగాణాకు ఒక్కటీ ఇవ్వలేదని ఎంపీ నామా నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. 2012-13లో తెలంగాణ ప్రాంతానికి మంజూరై వెనక్కి తీసుకున్న ఐటీఐఆర్‌ను మళ్లీ రాష్ట్రానికి కేటాయించడంపై ఆలోచించాలని సూచించారు. మైనారిటీలు, గిరిజనులు, ఓబీసీలు, ఎస్సీ వర్గీకరణపై రిజర్వేషన్లు కల్పించాలని 2014లోనే శాసనసభ తీర్మానం చేసి కేంద్రానికి పంపినా నేటికీ నిర్ణయం తీసుకోలేదని ఆయన ప్రభుత్వానికి విన్నవించారు. .

దళితబంధుతో జీవితాల్లో వెలుగులు: మంత్రి ఎర్రబెల్లి

హన్మకొండ, ఫిబ్రవరి 4:: ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు ఎంతో ముందు చూపుతో తీసుకొచ్చిన దళితబంధు పథకం దళితుల జీవితాల్లో వెలుగులు నింపడం ఖాయమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. రైతుల కోసం రైతుబంధు, రైతు బీమా, దళితుల బాగు కోసం దళితబంధు తీసుకొచ్చిన సీఎం కేసీఆర్ మనందరికీ ఆత్మబంధువు అని కొనియాడారు. హన్మకొండ జిల్లా కలెక్టరేట్‌లో గురువారం దళితబంధు కార్యక్రమం కింద రూ.4 కోట్ల 81 లక్షల 49 వేల విలువైన వాహనాలను కమలాపూర్ మండలంలోని 51 మంది షెడ్యూల్ కులాల లబ్ధిదారులకు అందజేశారు.

షెడ్యూలు కులాల అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ మంత్రి సత్యవతి రాథోడ్, ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. 10 మందికి హార్వెస్టర్లు, ఇద్దరికి ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు, ఒకరికి ఆటో ట్రాలీ, ఇద్దరికి బొలోరోలు, ఒకరికి జేసీబీ వాహనం, 16 మందికి

ట్రాక్టర్లు, రోటా వేటర్లు, ఇద్దరికి ట్రాక్టర్లు, ట్రాలీలు పంపిణి చేశారు.

ఈ పంపిణి కార్యక్రమంలో వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణ రెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి, నన్నపునేని నరేందర్, శ్రీధర్ బాబు, జెడ్పీ వైర్మన్లు గండ్ర జ్యోతి, సుధీర్ కుమార్, రాష్ట్ర షెడ్యూల కులాల అభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి కమిషనర్ విజయ్ కుమార్, జిల్లా కలెక్టర్లు రాజీవ్ గాంధీ హన్మంతు, గోపి, శివ లింగయ్య, శశాంక, రూపేష్ మిశ్రా, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగంలో మార్పు అవసరం.. దానికి ఎందుకింత గాబరా.. బీజేపీపై భగ్గుమన్న మోత్కుపల్లి

హైదరాబాద్, ఫిబ్రవరి 4:"ఏపీ, తెలంగాణ విభజన హామీలు ఎటు పోయాయి.. కేంద్ర ప్రభుత్వం ఒక్క విభజన హామీ కూడా నెరవేర్చలేదు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఎటు పోయింది.. కాజీపేట రైలు కోచ్ ఫ్యాక్టరీ ఎక్కడికి పోయిందో ఈ బీజేపీ ప్రభుత్వం చెప్పాలి.. నేషనల్ లెవల్ లో ఎదుగుతున్న సీఎం కేసీఆర్ తొక్కేందేకే బీజేపీ కొత్త ఎత్తుగడలు వేస్తోంది. మీరు కేంద్ర ప్రభుత్వంలో ఉంటే.. ఇవాళ నిధులన్ని మీరు పాలించే రాష్ట్రాలకి ఇస్తే పోరాటం చేయడం తప్పేంటి. తెలంగాణలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ఇస్తే మీరు పాలించే రాష్ట్రాల్లో ఎందుకు ఇవ్వడం లేదు. తెలంగాణలో దళిత బంధు ఇస్తున్న సీఎం కేసీఆర్ మీద విమర్శలు చేయడం అంటే.. మీరు ఎంత దుర్మార్గపు మనుషులో అర్థం అవుతోంది. దళితుల మీద మీకు ప్రేమ ఉంటే దేశవ్యాప్తంగా ఎందుకు దళిత బంధు ఇవ్వడం లేదో చెప్పాలి.."."దళితలకు న్యాయం చేసే దమ్ము ధైర్యం మీకు ఉందా.. కేసీఆర్ ను తిట్టడమే పనిగా పెట్టుకుంటే ఖబడ్దార్ మిస్టర్ బండి. నేను దళిత బంధు పోగ్రాంలో కూర్చుంటే ఎంతో సంతోషంగా ఉంది.. రేపటి బడ్జెట్ లో 20 వేల కోట్లు పెట్టబోతున్నారు సీఎం కేసీఆర్. దళితులను అవమాన పర్చే మీరు.. దళితలకు న్యాయం చేస్తారనడంలో నిజం లేదు. తెలంగాణలో ఆదర్శవంతంగా పాలన చేస్తుంటే ఓర్వలేక పోతున్నారు. ఈ బీజేపీ? కరుడుగట్టిన బూర్జువా పార్టీ .. ఒక్కరోజు కూడా మతం గురించి మాట్లాడని రోజు ఉందా.. దేశవ్యాప్తంగా సీఎం కేసీఆర్ ఆలోచనా విధానంపై చర్చిస్తుంటే ఓర్వలేక ఈ అనవసర ఆరోపణలు. అంబేద్కర్ ను అవమానించారని ఆందోళనలు చేస్తున్నారు"."ఆర్ ఎస్ ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కూడా రాజ్యాంగంలో మార్పులు చేయాలని అన్నారు. వాజపేయి ప్రభుత్వం రాజ్యాంగం మార్పుకోసం కమిటీ వేసింది.. మరి అది మీ బీజేపీనే కదా.. మీరు బీజేపీలో ఉన్నప్పుడు ఇవ్వన్నీ తెలుసుకోకుండా ఎందుకు మాట్లాడుతున్నారు. విదేశాల్లోని నల్లధనం తెచ్చి ప్రతి పేదవాడికి అందిస్తా అని మోడీ అన్నాడు.. ఎంత మందికి ఇచ్చారు మిస్టర్ బండి సంజయ్.. ఈ విషయంలో కనీసం సిగ్గు ఉందా"."ఇప్పటికే 105 సార్లు రాజ్యాంగ సవరణలు చేశారు. ఆనాడు అంబెద్కర్ కూడా చెప్పారు. అవసరమైతే రాజ్యాంగమే మార్చుకోవచ్చు అని. దళిత గిరిజన యువత ఎంతో ఆలోచన చేయాలి? అంబేద్కర్ గురించి సీఎం కేసీఆర్ ఎక్కడా తప్పుగా మాట్లాడలేదు.. రాజ్యాంగంపై చర్చ జరగాలి అన్నారు. అణగారిన కులాల పట్ల ఇంకా వివక్ష ఉంది.. సీఎం కేసీఆర్ దళిత వ్యతిరేకి అంటున్నారు కదా.. మరి మద్యం షాప్ లు, మెడికల్ షాప్ లు, ఇతర పరిశ్రమల్లో కూడా దళితులకు రిజర్వేషన్లు కల్పించారు. మరి ఈ మాట మాట్లాడరేంది.. దళిత బంధు అందించడంతో హుజురాబాద్ లో ఇవాళ ఇంటింటా పండుగ చేసకుంటున్నారు.. సీఎం కేసీఆర్ మీద మాట్లాడే ఏ వ్యక్తి అయిన సరే ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడాలి.. జై భీం అనే పదం మాట్లాడనికి మీకు హక్కు లేదు.. ఆనాడు నీళ్ల కోసం పోతే కూడా అంటరాని వాళ్లుగా హేళన చేశారు. కానీ, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నీళ్లు ఇస్తున్న మహనీయులు ముఖ్యమంత్రి కేసీఆర్." అని చెప్పుకొచ్చారు మోత్కుపల్లి నర్సింహులు..

డ్రోన్ రంగంలో ఉపాధి అవకాశాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:డ్రోన్ రూల్స్, 2021 ప్రకారం, రిమోట్ పైలట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ (ఆర్‌పీటీఓ)ని స్థాపించే అధికారాన్ని పొందాలనుకునే ఎవరైనా నిర్దిష్ట రుసుములతో పాటుగా డిజిటల్ స్కై ప్లాట్‌ఫారమ్‌లో ఫారం డీ5లో డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్‌కు దరఖాస్తును సమర్పించాలి. 31 డిసెంబర్ 2021 నాటికి, ప్రభుత్వ లేదా ప్రైవేట్ యాజమాన్యం కింద ఉన్న సంస్థల ద్వారా తొ

అర్ధరాత్రి పురిటినొప్పులు.. స్పందించిన108 సిబ్బంది..

హైదరాబాద్, ఫిబ్రవరి 4:మారుమూల అటవీ , గిరిజన గ్రామంలో ఓ గిరిజన మహిళకు ప్రసవ సమయం కావడంతో పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో 108 అంబులెన్స్ (వాహన సిబ్బంది) కి సమాచారం అందించగా 108 వాహన సిబ్బంది సకాలంలో స్పందిచడంతో 108 వాహనంలోనే ఆ మహిళ మహాలక్ష్మిలాంటి ఆడపిల్లను కనడంతో ఆ గిరిజన కుటుంబం కళ్ళలో కాంతులు మెరిశాయి. ఇందుకు సంబందించి 108 వాహన సిబ్బంది తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ములుగు జిల్లా మంగపేట మండలంలోని దోమెడ సబ్ సెంటర్ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గిరిజన గర్భిణీ స్త్రీ చీమల బాలమ్మ కి ప్రసవ సమయం రావడంతో గురువారం రాత్రి 2.30 గంటల సమయంలో (తెల్లవారితే శుక్రవారం) పురిటినొప్పులు రావడంతో స్థానిక 108 అంబులెన్స్ కి సమాచారం అందించారు.

సమాచారం అందుకున్న 108 సిబ్బంది హుటాహుటిన తిమ్మాపూర్ కు చేరుకుని గర్భిణీ స్త్రీకి ప్రథమ చికిత్స చేసి అనంతరం మెరుగైన వైద్యం కోసం మంగపేట సామాజిక ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో గర్భిణీ స్త్రీ కి పురుటినొప్పులు అధికంగా అయ్యాయి. దీంతో 108 వాహన పైలట్ సహాయంతో అంబులెన్స్ ని రోడ్డు పక్కకు నిలిపివేసి ఈఆర్ సీపీ సూచన, సలహాల మేరకు 108 వాహనంలోనే సుఖ ప్రవసం చేయించి, పండంటి ఆడబిడ్డకు పురుడుపోసి ఆ తల్లి కళ్ళలో ఆనందాన్ని నింపారు. తల్లి బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారు. అనంతరం ఈ విషయాన్ని వైద్యులకు తెలిపి మంగపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. సుఖప్రవసం చేసి పురుడుపోసిన 108 వాహన ఈఎంటి చిరంజీవి, పైలట్ వేణుగోపాల్, స్థానిక ఆశా కార్యకర్త తదితరులను గర్భిణీ స్త్రీ కుటుంబ సభ్యులు అభినందించారు.

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 4:సివిల్ సర్వీసెస్, ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్-2022 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. సివిల్ సర్వీసెస్ విభాగంలో మొత్తం 861 ఖాళీలకు ప్రకటన విడుదల చేసింది. ఏదైనా డిగ్రీ చేసిన అభ్యర్థులు సివిల్ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. డిగ్రీ ఫైనల్ ఇయర్ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని నోటిఫి కేషన్‌లో తెలిపింది. అభ్యర్థుల ఎంపిక విధానం ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ ఆధా రంగా అభ్యర్థుల ఎంపిక చేస్తారు. దరఖాస్తు ఫీజుగా రూ.వందగా నిర్ణయించారు. మహిళలు, ఎస్సీ,ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థు లకు ఫీజులో మినహాయింపు ఇచ్చారు. ఈ ఉద్యోగాల దరఖాస్తు ప్రక్రియకు ఆఖరి తేదీ ఈనెల 22గా నిర్ణయించారు.

యూజీసీ చైర్మన్‌గా తెలంగాణ వాసి జగదీష్ కుమార్

హైదరాబాద్, ఫిబ్రవరి 4:యూనివర్సిటీ గ్రాంట్స్ చైర్మన్ గా తెలంగాణాకు చెందిన మామిడాల జగదీష్ కుమార్ ను నియమిస్తున్నట్లు కేంద్రప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీకి వైస్-ఛాన్సలర్ గా జగదీష్ కుమార్ విధులు నిర్వహిస్తున్నారు. యూజీసీ చైర్మన్ గా ఐదు సంవత్సరాలు కొనసాగుతారని కేంద్రప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీరి స్వస్థలం నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం మామిడాల గ్రామం. ఇంటిపేరు ఊరుపేరు ఒక్కటే కావడం యాదృచ్ఛికం.

ఉద్యమాన్ని చంపేందుకు ప్రభుత్వం ఎత్తుగడలు: బండి శ్రీనివాసరావు

విజయవాడ, ఫిబ్రవరి 4:: అనమోలిస్ కమిటీ అంటున్న అధికారులకు దానిపై అవగాహన లేనట్టుందని స్టీరింగ్ కమిటీ సభ్యుడు బండి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్టీరింగ్ కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. అనంతరం శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ వేతన సవరణలో ఒక సీనియర్ ఉద్యోగికి జూనియర్ కన్నా అన్యాయం జరిగితే దానిని పరిష్కరించడానికి ఈ కమిటీ పని చేస్తుందన్నారు. ప్రభుత్వం ఉద్యమాన్ని చంపేందుకు కొన్ని ఎత్తుగడలు వేస్తోందన్నారు. ఇప్పుడు అనామలిస్ కమిటీ ఎక్కడుందో ఉద్యోగులు వెతుక్కోవాలా? అని ప్రశ్నించారు. వేతన గణన అనేది అర్థం కాని బ్రహ్మ పదార్థంలా అధికారులు మార్చేశారన్నారు. ఈ విషయంలో ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషన్‌కు పిచ్చి పట్టిందో... మాకు పట్టిందో అర్థం కావడం లేదన్నారు. అశుతోష్ మిశ్రా కమిషన్ నివేదికను పక్కన పెట్టి అధికారుల కమిటీ నివేదిక అమలు చేసి ఉద్యోగులకు అన్యాయం చేశారన్నారు. ఓ వైపు అభ్యంతరాలు చెప్పుకునే సమయంలోనే ప్రభుత్వం చీకటి జీవోలు ఇచ్చిందని, అదే సమయంలో ఉద్యోగులను భయపెట్టేలా వైద్యారోగ్య శాఖలో బదిలీలు చేసేందుకు సిద్ధమయిందన్నారు. ప్రభుత్వ ఎత్తుగడలను ఉద్యోగులు, ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇదే తరహాలో వ్యవహరించే ఎమెర్జెన్సీ సర్వీసులు నిలిపివేస్తామని బండి శ్రీనివాసరావు హెచ్చరించారు.

నీట్ బిల్లు తిప్పిపంపడంపై .గవర్నర్ పై ఆగ్రహం.

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:తమిళనాడు ప్రభుత్వానికి గవర్నర్ రవికి మధ్య వార్ నడుస్తోంది. నీట్ ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బిల్లును ఆమోదించకుండా గవర్నర్ స్పీకర్ కు తిప్పి పంపారు. దీంతో అక్కడి రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు 'గెటౌట్ రవి' అనే యాష్ ట్యాగ్ పేరుతో ఆందోళన చేస్తున్నాయి. దీనిపై డీఎంకే నేత కనిమొళి కూడా సీరియస్ గానే రెస్పాండ్ అయ్యారు.

నీట్ వ్యతిరేక బిల్లును అసెంబ్లీ స్పీకర్ అప్పావుకు తిరిగి పంపడంలో తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవిపై ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే) నేత కనిమొళి మండిపడ్డారు. అంతకుముందు నీట్ వ్యతిరేక బిల్లును తిప్పి పంపడంపై తమిళనాడులోని వివిధ రాజకీయ సంఘాలు గవర్నర్ ఆర్ఎన్ రవి తీరును ఖండించాయి. దీని తర్వాత ట్విట్టర్‌లో 'గెటౌట్‌రవి' అనే హ్యాష్‌ట్యాగ్ ను ట్రెండ్ చేయడం ప్రారంభించాయి. రాజకీయ నేతలు కూడా గవర్నర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సామాజిక న్యాయానికి విరుద్ధమైన నీట్ పరీక్షను రద్దు చేయాలని కోరుతూ శాసనసభలో చేసిన తీర్మానాన్ని గవర్నర్ ప్రభుత్వానికి తిప్పి పంపడంగ్రాంతికరం అని కనిమొళి తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

ఏపీ సర్కార్‌కు దెబ్బ మీద దెబ్బ..

అమరావతి, ఫిబ్రవరి 4:ఏపీ సర్కారు ఈ మధ్యకాలంలో తీసుకుంటున్న ప్రతి నిర్ణయం వివాదాస్పదంగా మారుతోంది. పలు అంశాలమీద ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ అటు కోర్టులు, ఇటు ప్రజా సంఘాలు ఆందోళన వెళిబుచ్చుతున్నాయి. మొన్నటిదాకా సినిమా టిక్కెట్ల ఇష్యూ.. నిన్న ఉద్యోగుల పీఆర్సీ విషయం.. ఇప్పుడేమో కొత్త జిల్లాల సమస్య.. ఇలా ఒకదాని తర్వాత ఒకటి ప్రభుత్వానికి దెబ్బమీద దెబ్బ పడుతున్నాయి. అయితే.. ప్రభుత్వ నిర్ణయాలపై చాలా మంది నుంచి సమర్ధన, విమర్శ రెండూ ఉంటున్నాయి. నిన్న ఉద్యోగుల సమ్మె.. ఇవ్వాల బాలకృష్ణ మౌనదీక్ష.. రాష్ట్రంలో జరుగుతున్న లేటెస్ట్ పరిణామాలపై ఓ లుక్కేద్దాం..

ఆంధ్రప్రదేశ్ లో వైఎన్ జగన్ ప్రభుత్వం వినూత్న నిర్ణయాలు తీసుకుంటోంది. సినిమా టికెట్ల విషయంలో తీసుకున్న నిర్ణయం నుంచి సినీ వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చిన సంగతి తెలిసిందే. పేదవారికి కూడా వినోదం పంచివ్వాలనేది ప్రభుత్వ ఆలోచనగా ఉంటే.. తాము నష్టపోతామనేది సినీ వర్గాల వాదన. ఆర్జీవీ వంటి వ్యక్తులైతే ప్రభుత్వానికి ఆ అధికారమే లేదన్న వాదనకు దిగారు. అయితే సినిమా టికెట్ల విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అదే పరిశ్రమలో సమర్ధించేవాళు కూడా ఉన్నారు. పేదలకు వినోదాన్ని అందించాలనే ప్రభుత్వ ఆలోచనను వ్యతిరేకించడం మంచిది కాదని కళ్యాణ్ వంటి నిర్మాతలు సూచించారు. సినీ

పరిశ్రమలో ఓ వర్గం ఆధిపత్యమే.. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించేందుకు కారణమని వాదించేవాళ్లు లేకపోలేదు.

సినీ టికెట్ల వివాదం సమసిపోకముందే.. పీఆర్సీ వ్యవహారం తెరపైకొచ్చింది. నెమ్మదిగా ప్రారంభమైన ఉద్యమం విజయవాడ ధర్నాతో పీక్స్ కి చేరింది. పోలీసుల అరెస్టులు, చెక్ పోస్టుల్లో ఆపేసినా.. ఆ తర్వాత పోలీసులు చూసీచూడనట్టు వదిలేశారు. ఫలితంగా విజయవాడ ఉద్యోగుల ధర్నా ఫుల్ సక్సెస్ అయ్యింది. విజయవాడ రోడ్లు జనంతో కిక్కిరిసిపోయాయి. బెజవాడ ధర్నా విజయవంతం కావడంతో ప్రతిపక్షాల విమర్శలు జోరందుకున్నాయి. విజయవాడలో ఉద్యోగులతో కిక్కిరిసిన రోడ్లే ప్రభుత్వ వ్యతిరేకతకు నిదర్శనమనే వ్యాఖ్యలు



విపక్ష నేతల నుంచి వినిపించాయి. అయితే.. విజయవాడలో కన్పించిన జనమంతా ఉద్యోగులు కాదని.. అన్ని ప్రతిపక్షాలు కలిసికట్టుగా జనం తరలించారని అధికార పార్టీ వర్గాలు అంటున్నాయి. అటు ప్రభుత్వం కూడా సమ్మెలతో, ధర్నాలతో సమస్యలు పరిష్కారం కావని.. చర్చలకు రావాలని పిలుపునిస్తోంది. కాగా, ప్రభుత్వంతో ఉద్యోగ సంఘాలు చర్చలు జరిపే విషయం ఇవాళ తేలనుంది.

ఇదిలా ఉండగా.. ఏపీ ప్రభుత్వం తీసుకున్న మరో నిర్ణయంపై మెజార్టీ జిల్లాల్లో హర్షం వ్యక్తమైంది. రాజంపేట, హిందూపురం, రంపచోడవరం వంటి కొన్ని ప్రాంతాల్లో మాత్రమే వ్యతిరేకత వస్తోంది. ముఖ్యంగా హిందూపురంను జిల్లా రాజధానిగా ప్రకటించకుండా.. పుట్టపర్తిని ప్రకటించడం వివాదానికి కారణమైంది. హిందూపురంను జిల్లా కేంద్రంగా ప్రకటించాలనే డిమాండ్ రోజు రోజుకూ పెరుగుతోంది. ఇదే విషయమై ఎమ్మెల్యే బాలకృష్ణ ఇవ్వాల మౌన దీక్షకు దిగారు. హిందూపురం పట్టణంలో భారీ ర్యాలీ తర్వాత దీక్ష చేపట్టారు.

కాగా, ఏపీలో సినీ టికెట్ల వివాదం, ఉద్యోగుల సమ్మె, కొత్త జిల్లాల సమస్య నేపథ్యంలో ప్రభుత్వం ఇరకాటంలో పడిందనేది ప్రతిపక్షాలు అంటుంటే.. మెజార్టీ ప్రజల మద్దతు తమకే ఉందనేది ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. పదిమందికీ ఉపయోగపడే ఒక నిర్ణయం తీసుకున్నప్పుడు కొంతమందిలో వ్యతిరేకత సహజమేనని అంటున్నారు మరికొందరు. మరి ఈ మూడు వివాదాలకు జగన్ ప్రభుత్వం ఎలా చెక్ పెడుతుందనేది అందరిలోనూ చర్చకు దారితీస్తూ.. ఆసక్తిని రేకెత్తిస్తోంది.

గోరఖ్‌పూర్ నుంచి నామినేషన్ వేసిన యోగి ఆదిత్యనాథ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:యోగి ఆదిత్యనాథ్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా, మరికొందరు ఉన్నత స్థాయి బీజేపీ నేతలు హాజరయ్యారు. శాసన సభ ఎన్నికల్లో యోగి పోటీ చేయడం ఇదే తొలిసారి. గతంలో ఆయన ఐదుసార్లు గోరఖ్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. ఉత్తర ప్రదేశ్ శాసన సభ ఎన్నికలు ఫిబ్రవరి 10 నుంచి మార్చి 7 వరకు ఏడు దశల్లో జరుగుతాయి. గోరఖ్‌పూర్ అర్బన్ శాసన సభ నియోజకవర్గానికి పోలింగ్ మార్చి 3న జరుగుతుంది. ఎన్నికల ఫలితాలు మార్చి 10న వెలువడతాయి.

యోగి నామినేషన్ దాఖలు చేయడానికి ముందు ఆయనతోపాటు అమిత్ షా ఓ ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు. యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ, రాజ్యాంగంలోని అధికరణ 370ని బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం రద్దు చేసిందని, అదేవిధంగా అయోధ్యలో రామాలయం నిర్మాణం కలను వాస్తవంగా సాకారం చేసిందని చెప్పారు. 2017లో జరిగిన శాసన సభ ఎన్నికల్లో బీజేపీ నాలుగింట మూడొంతుల ఆధిక్యంతో గెలిచిందన్నారు. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మహాకూటమిని బీజేపీ ఓడించిందని చెప్పారు. గడచిన ఐదేళ్లలో ఉత్తర ప్రదేశ్ అద్భుతంగా అభివృద్ధి చెందిందని చెప్పారు. తన ప్రభుత్వ విధానాల వల్ల అన్ని వర్గాలు లబ్ధి పొందాయన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వంపై ఎవరూ వేలెత్తి చూపలేరని చెప్పారు.

అమిత్ షా మాట్లాడుతూ, యూపీ శాసన సభ ఎన్నికల్లో బీజేపీకి 300కుపైగా

స్థానాలు లభిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. యోగి ఆదిత్యనాథ్ రాష్ట్రాన్ని మాఫియా నుంచి విముక్తి చేశారన్నారు. యోగి-మోదీ ప్రభుత్వాలు పేదల చెంతకు అభివృద్ధిని తీసుకొచ్చాయన్నారు.

సీఎం కేసీఆర్ వల్లే సంచార జాతుల సంక్షేమం: పూసల సంఘం

పెద్దపలి,,ఫిబ్రవరి 4: పెద్దపల్లి పట్టణంలోని అమర్ నగర్ చౌరాస్తాలో కెసిఆర్ చిత్ర పటానికి పూసల సంఘ సభ్యులు పాలాభిషేకం చేశారు. ముఖ్యమంత్రి వర్యులు కెసిఆర్ తెలంగాణ పూసల సంఘంను గుర్తించి ఉప్పల్ భాగాయత్ ఒక ఎకరా భూమి మరియు కోటి రూపాయలను ఫండ్ కేటాయించడం జరిగిందని, దానికి సంతోషించిన పూసల కులస్థులం గౌరవ కెసిఆర్ గారికి మా సంఘం తరఫున పాలాభిషేకం చేస్తూ, పాదాభివందనం చేస్తున్నామని తెలంగాణ పూసల సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ గుడ్ల సమ్మయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి వర్యులు కెసిఆర్ ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి సంచారజాతులలో 35 కులాలను గుర్తించి, వారికి హైదరాబాద్ లో ఆత్మ గౌరవ భవనాలను ఏర్పాటు చేసుకునేందుకు భూమి మరియు ఫండ్ ఏర్పాట్లు చేసిన సీఎం కేసీఆర్ కు ఎల్లవేళలా మేము రుణపడి ఉంటామన్నారు. ఇన్ని సంవత్సరాల చరిత్రలో ఏ ప్రభుత్వం ఏర్పడినా కానీ, ఏ పార్టీ అధికారంలో ఉన్నా కానీ సంచారజాతుల గుర్తించలేదని, తెలంగాణ ఏర్పడిన తర్వాతనే కెసిఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాతనే సంచార జాతులు వారి స్థితిగతులు ఏమిటి, వారి

అభివృద్ధి కోసం ఏ ఏ కార్యక్రమాలు చేయాలి అని ఆలోచించి అన్నింటిని ఒకే తాటిపైకి తీసుకువచ్చి, వారికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించారని పేర్కొన్నారు.జిల్లా అధ్యక్షులు పొదిరి కుమార స్వామి మాట్లాడుతూ పెద్దపల్లిలో సంఘ భవనానికి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి 5 లక్షల రూపాయలు, ఎమ్మెల్సీ భాను ప్రసాద్ 3 లక్షలు కేటాయించారని, ఇంకను కేటాయిస్తామని మాట ఇచ్చారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెరాసా పట్టణ అధ్యక్షులు ఉప్పు రాజ్ కుమార్, జిల్లా అధ్యక్షులు పొదిల్ల కుమార స్వామి, ప్రధాన కార్యదర్శి ముద్రకోల తిరుపతి, కోశాధికారి సదానందం, వర్కింగ్ ప్రెసిడెంట్ కిషన్, వైస్ ప్రెసిడెంట్ పట్టేం నర్సయ్య లతో పాటు పట్టణ అధ్యక్షుడు చెని కేశవులు, కోశాధికారి సతీష్, గౌరవ అధ్యక్షుడు ముద్రకోలా రాజయ్య, ప్రధాన కార్యదర్శి కోనేటి శ్రీనివాస్ లతో పాటు పలువురు పూసలు కులస్తులు పాల్గొన్నారు.

హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా చేయాల్సిందే-బాలకృష్ణ

హిందూపురం, ఫిబ్రవరి 4:: ఏపీలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న జిల్లాల్లో భాగంగా సత్యసాయి జిల్లా కేంద్రంగా హిందూపురం ఉండాల్సిందేనని టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మౌన దీక్ష చేయనున్న ప్రాంగణానికి చేరుకున్న ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తమ డిమాండ్‌ను నెరవేర్చుకునే పోరాటంలో భాగంగా అవసరమైతే రాజీనామా చేస్తానని ప్రకటించారు. రాత్రికి రాత్రే కొత్త జిల్లాల ప్రకటన చేశారని ఆయన మండిపడ్డారు. హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటిస్తే ఎన్నో లాభాలు ఉన్నాయని చెప్పారు. ఆధ్యాత్మిక అంశాల ఆధారంగానే సత్యసాయి జిల్లా, దాని కేంద్రం ఏర్పాటుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఆయన ఆరోపించారు. ఆధ్యాత్మికత ఆధారంగా జిల్లా కేంద్రం ఏర్పాటు చేస్తే ధర్నాలు చేయబోరని భావిస్తోందని ఆయన విమర్శించారు.అయితే, తనకంటే అధికంగా ఆధ్యాత్మిక చింతన ఎవరికైనా ఉందా? అని ఆయన ప్రశ్నించారు. తాను అఖండ అని, అన్ స్టాపబుల్ గా పోరాడతానని అన్నారు. ఈ ప్రాంతం కోసం ఏం చేయడానికైనా సిద్ధమని ప్రకటించారు. హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా చేస్తేనే ఆధ్యాత్మికంగానూ అన్ని విధాలుగా సరిపోతుందని చెప్పారు. హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని ఆయన తెలిపారు. అసలు హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా చేసేందుకు అన్ని అర్హతలు ఉన్నాయని అన్నారు. తమ డిమాండ్ నెరవేర్చకపోతే ధర్నా చేస్తామని, ఎవడొచ్చి ఆపుతాడో చూస్తానని అన్నారు. ఉద్యోగుల ఆందోళన నుంచి దృష్టిని మళ్లించేందుకే కొత్త జిల్లాల ప్రకటన చేశారని బాలకృష్ణ ఆరోపించారు. నిన్న నిరసన ర్యాలీలో ఉద్యోగులు స్వచ్ఛందంగా పాల్గొన్నారని ఆయన చెప్పారు.

వెంకటేశ్వర బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మంత్రి గంగుల

కరీంనగర్ ఫిబ్రవరి 4: (నేటినిజం ప్రతినిధి): శ్రీ వెంకటేశ్వర స్వామి పంచమ బ్రహ్మోత్సవాలు కరీంనగర్ నగరంలో అత్యంత ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం పండితుల మంత్రోచ్చరణల మధ్య బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ సతీ సమేతంగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో నగర మేయర్ సునీల్ రావుతో పాటు పెద్ద సంఖ్యలో ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

రాజన్న భక్తులకు కరోనా నుండి రక్షణ .. 20వేల మాస్కుల అందజేత..

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 4:(నేటినిజం ప్రతినిధి): దక్షిణ కాశీగా విరాజిలుతున్న వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి విచ్చేస్తున్న భక్తులకు కరోనా బారిన పడకుండా రక్షించేందుకు వేములవాడ పట్టణానికి చెందిన భాను ఏజెన్సీ సంస్థల అధినేత నగుబోతు రవీందర్ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా 20 వేల మాస్క్ లు , 600 వందల లీటర్ల సానిటాయిజర్లు సుమారు 80 వెల రూపాయిల విలువగలవి ఈఓ రమాదేవి కి అందజేశారు. గతంలో భాను ఏజెన్సీ సంస్థ నుండి నగుబోతు రవీందర్ మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు ,తాగునీటి సౌకర్యం ,శానిటేషన్ సంబంధించిన పరికరాలను అందించేవారు. సామాజిక కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందు వరుసలో వుండే సామాజిక కార్యకర్త నగుబోతు రవీందర్ కు ప్రశంసల జల్లులు కురుస్తున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఈ రాజేష్,ఏఈఓ ప్రతాప నవీన్ ,పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు,హరిహర్నథ్, ఎల్ రాజేందర్ ,ఎడ్ల శివ ఉన్నారు.

ఉద్యోగులు రెండు పీఆర్సీల కాలాన్ని కోల్పోయారు: సూర్యనారాయణ

విజయవాడ, ఫిబ్రవరి 4:: రాష్ట్రంలో ఉద్యోగులు రెండు పీఆర్సీల కాలాన్ని కోల్పోయారని, వేతన సవరణ తేదీకి.. అమలు తేదీకి ప్రభుత్వాలు వ్యత్యాసం వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని స్టీరింగ్ కమిటీ సభ్యుడు సూర్యనారాయణ అన్నారు. నిన్న ఛలో విజయవాడ కార్యక్రమం విజయవంతం కావడంతో శుక్రవారం స్టీరింగ్ కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. అనంతరం సూర్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ మధ్యంతర భృతి వెనక్కు తీసుకోలేదన్నారు. మధ్యంతర భృతి వడ్డీ లేని అప్పు అని తమకు తెలీదన్నారు. మధ్యంతర ఉపశమనం ఏ రకంగా రుణంగా కనిపించిందో అధికారులు చెప్పాలన్నారు. ఐఏఎస్‌లు చదివిన గొప్ప చదువులు తాము చదవక పోయినా ఇది సాధారణ లెక్కలేనని ప్రతీ ఉద్యోగికి తెలుసన్నారు. ఐఆర్ జీవోలో ఒక తరహాగా గత పీఆర్సీలో ఒకలా ఉండటం తప్పుదోవ పట్టించడమేనన్నారు. జీవోను నిలుపుదల చేయాలని చెప్పినా... అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలన్నారు. అవగాహన రాహిత్యం ఎవరిదో... అధికారులే అర్థం చేసుకోవాలన్నారు.

అనామలిస్ కమిటీ అంటే సాధారణంగా చేయాల్సిన దాని కంటే భిన్నంగా ఉన్నవాటిని పరిష్కరించడానికేనని, దానికి భిన్నంగా ప్రభుత్వం ఆలోచిస్తోందని సూర్యనారాయణ అన్నారు. కేంద్ర పే కమిషన్‌కు వెళ్తామని చెప్పడాన్ని కూడా తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. పీఆర్సీ అమలు విషయంలో మూల వేతనం నిర్ధారించే విషయంలో కేంద్రం నిర్ధారించిన సిఫార్సులు ఆచరణలోకి తీసుకున్నారా? లేదా చెప్పాలని సూర్యనారాయణ డిమాండ్ చేశారు.

అసదుద్దీన్ ఒవైసీపై హత్యాయత్నాన్ని ఖండించిన మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ..

-నల్ల బ్యాడ్జీలతో నమాజ్ అనంతరం ఎంఐఎం నాయకుల నిరసన

కరీంనగర్ ఫిబ్రవరి 4: (నేటినిజం ప్రతినిధి): తుపాకీ సాంప్రదాయానికి, గూండాయిజానికి మన భారత సంస్కృతిలో స్థానం లేదని మాజీ డిప్యూటీ మేయర్ మహమ్మద్ అబ్బాస్ సమీ, ఎంఐఎం యువ నాయకుడు అజహర్ దబీర్ అన్నారు. గురువారం ఉత్తరప్రదేశ్‌లోని ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీపై జరిగిన హత్యాయత్నంపై శుక్రవారం స్పందించారు. యూపీ ప్రభుత్వం ఒక జాతీయ పార్టీ అధ్యక్షుడైన ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కి పూర్తిస్థాయిలో భద్రత ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. ఎన్నికల వేళ ఇలాంటి పరిణామాలు చోటు చేసుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్ లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా యూపీ ప్రభుత్వం, ఎన్నికల సంఘం ఈ ఘటనపై స్పందించి నిష్పాక్షిక న్యాయ విచారణ జరిపించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశంలో శాంతియుత వాతావరణాన్ని దెబ్బతీయాలనే కుట్రలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ పెను ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడినందుకు ఆయన అల్లాహ్ కు కృతజ్ఞతలు తెలిపారు. తమ అధి నాయకుడు ఆయురారోగ్యాలతో క్షేమంగా ఉండాలని అల్లాహ్ ఎదుట శుక్రవారం పర్వదినాన దుఆ చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంఐఎం నాయకులు గులాం రబ్బానీ ఖాద్రి, యాఖుబ్, కాజమ్ అలీఖాన్, అజహర్ దబీర్, ముస్తఫా, ముఫ్తి ఆసీఫ్ హుస్సామీ తదితరులు ఉన్నారు.

ఢిల్లీలో తెరుచుకోనున్న స్కూళ్లు, జిమ్‌లు - రాత్రి కర్ఫ్యూలో సడలింపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం నుంచి విద్యా సంస్థలు, కోచింగ్ సెంటర్లు, జిమ్‌లు తెరుచుకోనున్నాయి. అయితే స్కూళ్లను దశలవారీగా తెరుస్తారు. తొలుత 9-12 తరగతులకు క్లాసులు నిర్వహిస్తారు. కరోనా కేసులు తగ్గిన నేపథ్యంలో ఢిల్లీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (డీడీఎంఏ) ఈ మేరకు శుక్రవారం నిర్ణయం తీసుకున్నది. అయితే టీకా తీసుకోని ఉపాధ్యాయులను విధులకు అనుమతించబోమని తెలిపింది. అన్ని కార్యాలయాలు వంద శాతం సిబ్బంది హాజరుతో పని చేయవచ్చని పేర్కొంది.మరోవైపు ఒంటరిగా కారు నడిపే డ్రైవర్లకు మాస్క్ ధరించడం నుంచి మినహాయింపు ఇచ్చారు. అలాగే రాత్రి కర్ఫ్యూ సమయాన్ని కుదించారు. ఇప్పటి వరకు రాత్రి పది గంటల నుంచి ఉదయం ఐదు గంటల వరకు నైట్ కర్ఫ్యూ అమల్లో ఉంటున్నది. అయితే దీనిని రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు అమలు చేస్తారు.కాగా, ఢిల్లీలో కరోనా పరిస్థితి మెరుగుపడటంతోపాటు 15-18 ఏండ్ల వయసు వారు టీకాలను పెద్ద సంఖ్యలో పొందినట్లు డీడీఎంఏ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో స్కూళ్లను తెరువడంపై నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

మీ కోసం

మీ కోసం

నేటినిజం లో..

'స్వీయ పరిచయవేదిక' త్వరలో...

వారం, వారం వర్ధమానులు, ప్రవర్ధమానులు తమ రచనల్ని అందించడానికి అనువైన పత్రికగా భాసిల్లుతున్న 'నేటినిజం" మరో కొత్త శీర్షికకు త్వరలో శ్రీకారం చుట్టబోతోంది. అనేక మంది కవులు, కవయిత్రులు తమ సాహితీ ప్రస్థానాన్ని 'నేటినిజం' స్వాగత తోరణం ద్వారానే ప్రవేశించిన వారున్నారు. ప్రసిద్ధులుగా తమ రచనల ద్వారా పాఠకుల హృదయాల్లో చోటు చేసుకున్న వారం సైతం చాలా మంది క్రమం తప్పకుండా పత్రికను ఆదరించి, ఆశీర్వదిస్తున్నారు.

కొత్తగా కలంపట్టే వారికి ప్రేరణనందించే విధంగా ప్రసిద్ధ కవులు, రచయితలు తమ రచనల ద్వారా 'నేటినిజం'లో ప్రేరణనందించడాన్ని చూస్తున్నాం. సాహిత్య సృజన చేస్తున్న కవులు, కవయిత్రులు, రచయితలు, రచయిత్రులను పరిచయం చేసేందుకు లోగడ 'నేటినిజం' ద్వారా విశేష కృషి జరిగిన విషయం మీకు తెలిసిందే.. ఇదే క్రమంలో కలం పట్టి సామాజిక చైతన్యానికి కృషి చేస్తున్న సృజనకారులు తమకు తామే స్వీయ పరిచయం చేసుకునేందుకు.. 'నేటినిజం' ముందుకు రాబోతున్నది. 'స్వీయ పరిచయ వేదిక' అన్న శీర్షికతో ప్రతివారం సాహితీ కెరటాల ద్వారా అందించాలని సంకల్పిస్తున్నాం..

ఈ సందర్భంగా దిగువ సూచనలు గమనించి తమ పరిచయాన్ని తామే పంపించగలరని కోరుతున్నాం..

సూచనలు:

1) ఇదివరకే తమ రచనల ద్వారా సాహితీ లోకానికి కవులుగా, రచయితలుగా, పరిచయమున్నప్పటికీ.. మీ, మీ మాటల్లోనే మీ గురించి రాసిన పరిచయ వాక్యాలను ఇంకా సమగ్రంగా సాహితీ బంధువులకు తెలియజేసే ఉద్దేశంతో ప్రారంభించబడుతున్న శీర్షిక ఇది. కనుక వాస్తవ విషయాలనే ప్రస్తావిస్తారన్న విశ్వాసముంది. వాస్తవాలనే పంపాలన్న సంగతి చెప్పాల్సిన అవసరం లేదు.

2) పేరు, వృత్తి, చిరునామా.. ఇత్యాది విషయాలను మొదట పేరాలో మీకు మీరే పరిచయం చేసుకోవాలి.

3) రచనా వ్యాసంగంలోకి కవిగా, రచయితగా ప్రవేశించిన సం॥... తమ తొలి రచన.. ఇత్యాది వివరాలు సంక్షిప్తంగా రాయాలి.

4) సాహితీ లోకంలో సృజనకారులుగా అడుగులు వేయడానికి మీకు ప్రేరణనిచ్చింది ఎవరు? వారికి సంబంధించి మీకు ఏ రచన ప్రభావితం చేసింది? వివరాలు సంక్షిప్తంగా రాయాలి.

5) ఇప్పటి వరకు రాసిన కవితలసంఖ్య, వ్యాసాల సంఖ్య, కథలు.. ఇతరత్రా ప్రక్రియల్లో మీరు ప్రదర్శిస్తున్న ప్రతిభకు సంబంధించిన వివరాలు-సంక్షిప్తంగా..

6) మీరు వెలువరించిన గ్రంథాలు.. ప్రక్రియలు.. ఏయే సంవత్సరాల్లో.. తదితర వివరాలు.. పుస్తకాల పేర్ల జాబితాను పొందుపరచాలి.

7) మీరు పొందిన సాహిత్య పురస్కారాలు.. లిస్ట్ పొందు పరుచవచ్చు. పొందుపరిచే క్రమంలో.. ముఖ్యమైన వాటినే ప్రస్తావించాలి.

8) మీరు పొందిన బిరుదులు-వివరాలు-అందించిన సంస్థలు-వాటి వివరాలు

9) మీరు రచించిన కవితల్లో/ కథల్లో/ రచనల్లో మీకు బాగా నచ్చింది ఏమిటి? వివరాలు సంక్షిప్తంగా పొందుపరచవచ్చు.

10) మీరు పాల్గొన్న సభల్లో మీకు బాగా నచ్చిన సభ.. వివరాలు అందించండి.

11) ప్రసిద్ధ కవులు-రచయితలతో సభను పంచుకున్న సభలనూ వివరించవచ్చు.

12) మీ ద్వారా సాహితీకారులకు పురస్కారాలు అందిస్తే వివరాలు తెల్పండి.

13) మీరు ఏదైనా పత్రికకు కాలమిస్టుగా వ్యవహరిస్తే.. వివరాలు రాయాలి.

14) మీరు వెలువరించిన గ్రంథాలకు సంబంధించిన గ్రంథాల టైటిల్ పేజీలను మీకు ఇష్టమైన వాటిని **ఐదు**కు మించకుండా పంపాలి.

15) మీ సాహిత్య ప్రస్థానంలో మీరు పాల్గొన్న సభలకు సంబందించిన ఫోటోలు ఉంటాయి. వాటిలో కూడా అతి ముఖ్యమైన వాటిని ఎంపిక చేసుకుని **ఐదింటిని** మాత్రమే పంపాలి.

16) మీ రచనలపై ఏ విశ్వ విద్యాలయంలోనైనా పాఠ్యాంశాలుగా నిర్ణయింపబడితే వాటి వివరాలు ఇవ్వండి.

17) మీ రచనలపై ఏ విశ్వవిద్యాలయంలోనైనా పరిశోధనలు జరుగుతున్నట్లయితే వివరాలు.. అందించండి..

18) సాహిత్య సంస్థల నిర్వహణలో మీకున్న భాగస్వామ్యం వివరాలు-

19) ఇప్పుడొస్తున్న కవిత్వం/ కథలు/ ఇతర సాహిత్యంపై మీ అభిప్రాయం.

20) మంచి కవిత్వానికి/ కథకు/ రచనకు ఉండాల్సిన లక్షణాలు.. ఎలా ఉండాలని కోరుకుంటున్నారు?

21) ఇప్పుడొస్తున్న అంతర్జాల కవిత్వ సమూహాలు.. కవిత్వ సృజన జరుగుతున్న తీరు తెన్నులపై మీ అభిప్రాయం.

22) ఆధునిక సమాజంలో ఏ విధమగు సాహిత్యం/ కవిత్వం/ కథలు రావాలని కోరుకుంటున్నారు?

23) మీ లేటెస్ట్ పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటో పంపాలి.

పై అంశాల్లో మీకు సంబంధించిన వివరాలు ఉంటేనే మీ పరిచయ వ్యాసంలో పొందుపరచాలి. సంబంధం లేని అంశాలను వదిలేయాలి.. 'ఏమీ లేవు' అని పేర్కొనవలసిన అవసరం లేదు.

వివాదాస్పదమైన విషయాలను రచనలను అసలే ప్రస్తావించకూడదన్న విషయం మీకు తెలియందికాదు.

స్వీయ పరిచయానికి సంబంధించి మీరు ఇంకేమైనా ప్రస్తావించ దలుచుకుంటే ప్రస్తావించవచ్చు.

మీ పరిచయం వ్యాసం మూడు అరతావులకు మించకూడదు.

బాగా ఆలోచించాకే విశేషాల వివరాలు పొందుపరచాలి. మళ్లీ మార్పులు-చేర్పులు చేయడానికి వీలుండదు.

'నేటినిజం'లో మీ పరిచయాన్ని ముద్రించే విషయంలో తుది నిర్ణయం సంపాదకులదే..

ఏ విధమైన ఉత్తర ప్రత్యుత్తరాలకు.. ఫోన్ సంప్రదింపులకు అవకాశం లేదు.

వీలు వెంబడి క్రమంగా ఒక్కోవారం ఒక్కో సృజనకారుని పరిచయం ప్రచురించడం జరుగుతుంది. మీ వంతు వచ్చేవరకు వేచి ఉంటారన్న విశ్వాసముంది.

ఇంకా ఆలస్యం దేనికి?

పై సూచనలు పాటిస్తూ మీ పరిచ వ్యాసం రాసి పంపండి..

E-mail : netinizam2020@gmail.com

– బైస దేవదాసు
సంపాదకులు: 'నేటినిజం'

గంగపుత్రుల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు: ఎర్రబెల్లి

హనుమకొండ, ఫిబ్రవరి 4:: తెలంగాణలో గంగపుత్రుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నదని పంచాయితీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. సీఎం కేసీఆర్ అన్ని కులాల వారికి పలు రకాల పథకాలు అమలుచేస్తూ వారి ఉన్నతికి పాటు పడుతున్నారని అన్నారు. శుక్రవారం హన్మకొండలోని మినిస్టర్ క్యాంప్ కార్యాలయంలో వరంగల్ జిల్లా గంగపుత్ర (బెస్త) పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం 2022 సంవత్సరపు డైరీని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో గంగపుత్రుల అభివృద్ధికి సంక్షేమానికి ఎన్నో పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నారని అన్నారు.

ఈ పథకాలు నిరుపేద గంగపుత్రులు వినియోగించుకునే విధంగా కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర (బెస్త) పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ పరపతి సంఘం వరంగల్ శాఖ అధ్యక్షులు డోలి రాజలింగం, కార్యదర్శి పారిపల్లి రాజేంద్ర కుమార్, ఉపాధ్యక్షులు పాక వీరస్వామి, సంయుక్త కార్యదర్శి ఏలుగు వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు, సంఘ బాధ్యులు పాల్గొన్నారు.

దళితబంధు పథకాన్ని ఎస్సీవర్గాలు సద్వినియోగం చేసుకోవాలి

పాలకుర్తి, ఫిబ్రవరి 4:: ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి అమలు చేస్తున్న దళిత బంధు పథకాన్ని షెడ్యూల్డ్ కులాల కుటుంబాలు వినియోగించుకొని సాంఘికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఉద్బోధించారు. శుక్రవారం పాలకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం లోని తీగారం, బంజారా గ్రామాలలోని దళిత వాడలలో దళితబందు కార్యక్రమం అమలుపై నిర్వహించిన గ్రామ సభలలో మంత్రి పాల్గొన్నారు. దళిత బందు కార్యక్రమంలో భాగంగా తీగారం గ్రామంలో 20 మంది, బంజారా గ్రామంలో 15 మంది షెడ్యూల్డ్ కులాల కుటుంబాల లబ్దిదారులను ఎంపిక చేసి ఒక్కొక్కరి బ్యాంకు ఖాతాలో 10 లక్షల రూపాయలు జమ చేస్తామని ఆయన తెలిపారు.

లబ్ధిదారులు లాభకరమైన యూనిట్లను ఎంపిక చేసుకోవాలని ఆయన సూచించారు. లబ్ధిదారుడు ఎంపిక చేసుకున్న యూనిట్లను మార్చి 7వ తేదీ వరకూ గ్రౌండింగ్ చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు. లబ్ధిదారుల ఎంపిక తదుపరి వారికి శిక్షణ, పెట్టబోయే పథకంపై లబ్ధిదారునికి సరైన అవగాహన కల్పించడం మున్నగు అంశాలపై అధికారులు శ్రద్ధ తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రతి దళిత కుటుంబానికి ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఎంపిక చేసిన లబ్ధిదారులు ఈ పథకాన్ని వినియోగించుకొని అభివృద్ధి చెందాలని ఆయన కోరారు.

సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం దేశానికి దిక్సూచి అని మంత్రి తెలిపారు. మొదటి దశలో ఈనెల 5వ తేదీలోగా ప్రతి నియోజకవర్గం నుండి పంద మంది లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగా పాలకుర్తి నియోజకవర్గములో 6 గ్రామాల నుండి 100 మంది లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని ఆయన తెలిపారు. దళిత బంధు పథకం క్రింద రాష్ట్రంలోని 17 లక్షల మంది దళితులకువచ్చే మూడు నాలుగు ఏళ్ళలో ఆర్థిక సహాయాన్ని అందించినున్నట్లు ఆయన తెలిపారు. అందులో భాగంగా రాబోయే రాష్ట్ర బడ్జెట్ లో ఈ పథకం అమలుకు 20 వేల కోట్ల రూపాయలు కేటాయిస్తామని ఆయన చెప్పారు. ఇలాంటి పథకం దేశంలోనే ఎక్కడా లేదన్నారు.

క్యాన్సర్ పట్ల జాగ్రత్త వహించండి శాతవాహన లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డా. నరేందర్ రెడ్డి

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 4:(నేటినిజం ప్రతినిధి):క్యాన్సర్ పట్ల అందరు జాగ్రత్త వహించాలి రాకముందే జాగ్రత్త తీసుకోవాలని శాతవాహన లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ నరేందర్ రెడ్డి అన్నారు కరీంనగర్ స్థానిక అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకొని శాతవాహన లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో నిర్వహింపబడినటువంటి ప్రపంచ క్యానసర్ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిధిగా హాజరై వారు మాట్లాడారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని మరియు ఆరోగ్య ప్రమాణాలను తప్పనిసరిగా క్రమం తప్పకుండా పాటించి ఆరోగ్యకరమైన సుఖవంతమైన మార్గాన్ని అనుసరించాలని చెప్పారు . క్యాన్సర్ అనేది ఒక మహమ్మారి అని అది చాలా భయంకరమైనదని మరియు మనుషుల శరీరంలోకి ఆశ్చర్యకరంగా ప్రవేశించి మనిషి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నదనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదని చెప్పారు . నేడు ప్రపంచంలో చాలా మంది క్యాన్సర్ బారిన పడుతున్నారని మరియు మృత్యువును ఎదురుకుంటు నారని ఇది చాలా విచారకరమని మరియు సమాజ అభివృద్ధికి ఆటంకాలు కల్గిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు . నేడు ప్రపంచంలో ప్రతి ఆరుగురిలో లో ఒకరు క్యాన్సర్ మహమ్మారి బారిన పడుతున్నారని మరియు కుటుంబాలకు దూరమవుతున్నారని ప్రతిఒక్కరు దాని సూచికలు ఎప్పటికప్పుడు గ్రహిస్తూ దాని నివారణకై పాటుపడి మరింత ఆయుశును పొందాలని కోరారు . ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిఒక్కరు వారిపై ప్రేమ వాత్సల్యాన్ని కనబరచాలని మరియు వారిలో ధృడసంకల్పాన్ని పెంపొందించి మార్గదర్శకంగా ఉండాలని సూచించారు . కార్యక్రమ ప్రధాన వక్త లయన్ డా॥బి. మధుసుధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో క్యాన్సర్ మహమ్మారి ఎన్నో జీవితాలని బలతీసుకుంటుందని మరియు కుటుంబాలలో ఆవేధనను మిగిలిస్తున్నదని వారు చెప్పారు . ప్రపంచంలోని పలు పెద్ద దేశాల్లో క్యాన్సర్ రోగ నివారణకై స్వయం ప్రతిపత్తిగల కేంద్రాలను రూపొందిస్తు వారికి అన్ని అధికారాలు బదీలుచేయడం జరుగుతుందని మరియు మొట్టమొదటి సారిగా 2000 వ సంలో ప్రపంచం క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహించారని మరియు 2008 వ సంలో దీనికి అధికారికంగా గుర్తించడం జరిగినదని మరియు 2009 నుండి పూర్తిస్తాయి పోటీ పరీక్షల గుర్తింపు పొందినదని హర్షం వ్యక్తం చేశారు . కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నిర్వహింపబడిన వ్యాసరచన పోటీలలో పాఠశాలకు చెందినటువంటి 3 వ తరగతి విభాగంలో : లిఖిత , మైరా నిబారస్ మరియు డి . చంద్రహాస్ లు 4 వ తరగతి విభాగంలో వై . రుహాన్ , ఎ . మోక్ష మరియు వి . సాయి ఆరాధ్య ల్లు 5 వ తరగతి విభాగంలో , యస్.హంసిని , వి . శ్రీచరణ్ మరియు సాహిశ్నలు 6 వ తరగతి విభాగంలో , పి . సాయి హృదయ్ , నయన్ శ్రేష్ఠ రావు మరియు డి . ఉదయశ్రీ లు సంబంధిత తరగతుల్లో 1 , 2 మరియు 3 బహుమతులను గెలుపొందారని తెలిపారు . గెలుపొందిన వారికి జ్ఞాపికలను ప్రదానం చేసారు . ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయులు మరియు తల్లితండ్రులు పాల్గొన్నారు .

ఆసుపత్రి భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి : మురళీధర్ రెడ్డి

అమరావతి, ఫిబ్రవరి 4:నాడు-నేడు కార్యక్రమం క్రింద ఏరియా ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లు, వైయస్సార్ హెల్త్ క్లినిక్ ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మురళీధర్ రెడ్డి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, కాంట్రాక్టర్ల ఏజెన్సీలను ఆదేశించారు. శుక్రవారం కర్నూల్ మెడికల్ కళాశాలలోని న్యూ లెక్చరర్ గ్యాలరీలో ఆసుపత్రి భవనాల నిర్మాణ పనుల ప్రగతిపై రాయలసీమ జిల్లాల ఏపీ ఎంఎస్ఐడీసీ ఇంజనీర్లు, కాంట్రాక్ట్ ఏజెన్సీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఇంజినీర్ ఇన్ చీఫ్ శివారెడ్డి, ఎస్ఈ లు క్రిష్ణారెడ్డి, రమేష్ రెడ్డి, రాయలసీమ జిల్లాల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, కాంట్రాక్ట్ ఏజెన్సీలు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఏపీ ఎంఎస్ఐడీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రి భవనాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రాయలసీమ జిల్లాల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, కాంట్రాక్ట్ ఏజెన్సీలను సూచించారు. నాబార్డ్ కింద మంజూరైన కర్నూలులో 16, అనంతపూర్ లో 17, కడపలో 13, చిత్తూరులో 12 వెరసి మొత్తం 58 ఆసుపత్రి భవన నిర్మాణ పనుల్లో వచ్చే సమావేశానికి ప్రగతి కనపరచాలన్నారు. వచ్చే జూన్ నాటికి 25 నిర్మాణ పనులు పూర్తయి ప్రారంభానికి సోచుకోవాలన్నారు. ప్రభుత్వం ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదన్న నేపథ్యంలో రీజినల్ స్థాయి కాన్ఫరెన్స్ లు నిర్వహించి పనులు ముమ్మరం చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పనుల్లో ఆలస్యం చేసే కాంట్రాక్ట్ ఏజెన్సీలకు నోటీసులు జారీ చేస్తామన్నారు. జరుగుతున్న పనులపై ప్రతిరోజు సమీక్షించాలని ఈ ఈ లను ఆదేశించారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేసిన జడ్పీటీసీ మ్యాకలరవి

-నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే రమేష్ బాబుకు కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్థులు

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 4:(నేటినిజం ప్రతినిధి):అనుపురం గ్రామంలో వైకుంఠ ధమం లో సీసీ రోడ్డు నిర్మించుకునుటకు, శాసనసభ్యులు డా చెన్నమనేని రమేష్ బాబు సహకారంతో ఎస్ డీఎఫ్ ఎన్ ఆర్ ఈజీఎస్ నిధులతో సర్పంచ్ కొండపల్లి వెంకటరమణ రావు ఆధ్వర్యం లో సీసీ రోడ్డు పనులకు శుక్రవారం వేములవాడ అర్బన్ జెడ్పీటీసీ మ్యాకల రవి భూమి పూజ చేశారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ మ్యకల రవి ఉపసర్పంచ్ కర్రే శ్రీనివాస్, ఎంపీటీసీ బాస రాజశేఖర్, వార్డ్ సభ్యులు దొంతుల శ్రీనివాస్ రెడ్డి వానపట్ల లచ్చిరెడ్డి తిప్పరవెని రాజు కోప్షన్ ఎర్రం మల్లయ్య వైస్ చేర్మన్ శీలం రామచంద్రారెడ్డి నాయకులు మెరుగు శ్రీనివాస్ వనపట్ల నరసింహ రెడ్డి కొండపల్లి వేణుగోపాల్ రావు చిట్ల దేవయ్య చిట్ల సతీష్ ఎర్రం ముత్తయ్య ఏర్రం దేవయ్య మెచ్చినేని కమాలకర్రావు వనపట్లా ప్రభాకర్ రెడ్డి వేముల అనిల్ రెడ్డి నమల చెంద్రయ్య చిలివెరి పర్శరములు ప్రజలు తదితరులు పాల్గొన్నారు ఈ నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే రమేష్ బాబు జడ్పీటీసీ, సర్పంచ్, కృతజ్ఞతలు తెలిపారు

మండల అరె సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 4:(నేటినిజం ప్రతినిధి):వేములవాడ మండలం అరె సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక శుక్రవారం హడ్ హాక్ కమిటీ అధ్యక్షుడు సిలువేరి మల్లేశం ఆధ్వర్యంలో వేములవాడ మార్కెట్ యార్డులో ఎన్నిక జరిగింది. ఎన్నిక ఏకగ్రీవంగా జరుగగా వేములవాడ మండల అభ్యర్థులుగా గుండెకార్ల నరేష్ (ఆరెపల్లి), ఉపాధ్యక్షులుగా ఎంద్రాల శ్రీనివాస్ (జయవరం), వాడిజ మల్లయ్య (అయ్యోరుపల్లి),ప్రధాన కార్యదర్శి ఎంద్రాల అశోక్ (వేములవాడ టౌన్), సహాయ కార్యదర్శి వానిక విజయ్ (నాంపల్లి), కోశాధికారి సాందేసారం మహేందర్ (బొల్లారం), కార్యవర్గ సభ్యులుగా సిలువేని దేవయ్య (ఆరెపల్లి), కైరిక దేవరావు (మారుపాక) పోవారి రవి (రుద్రవరం), ఏడిగ రాజేందర్ (శాభాషపల్లి)లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు అని వారు తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీని కుల సంఘ సభ్యులు సన్మానించిన సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సంగం అధ్యక్షుడు కోలే అంజి, సర్పంచ్ లు నందయ్య, కల్పన సరేశ్, నవీన రాజు సంఘం నాయకులు హింగే రాజశేఖర్,కాతుబండ నర్సింగరావు, మాంజేడీ గోపాల్, హింగే శ్రీనివాస్, బావాండ్ల బాబు, కిష్టస్వామి, కైరిక హనుమంతరావు, నాగరాజు తదితరులు ఉన్నారు

కరోనా మృతురాలికి అంత్యక్రియలు నిర్వహించిన ముస్లిం సోదరులు

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 4:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఓ మహిళ మహమ్మారి కరోనా తో శుక్రవారం మృతి చెందగా కుటుంబ సభ్యులు, సిరిసిల్ల మజీద్ కమిటీ అధ్యక్షులు ముస్తఫా సమాచారం ఇవ్వగా వెంటనే ముస్తఫా, పట్టణంలోని సుభాష్ నగర్ కు చెందిన అతని మిత్రబృందం యువకులు హాజీ,' మిస్కిన్, సల్మాన్ , మన్సూర్ ,తబ్బు, యాకూబ్ తో కలిసి పిపి కిట్లు ధరించి మహిళలకు అంత్యక్రియలను నిర్వహించారు, ప్రాణాలకు తెగించి మతాలకు అతీతంగా మహిళ అంత్యక్రియలు నిర్వహించినముస్లిం సోదరులు , జిల్లా పట్టణ ప్రజలు, ముస్లిం సోదరులు, మహిళ బంధువులు అభినందించారు.

ఆందోళన వద్దు.. కరోనాని ధైర్యంగా ఎదుర్కొందాం : మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్, ఫిబ్రవరి 4:: ఆందోళన వద్దు.. కరోనాని ధైర్యంగా ఎదుర్కొందాం, మీకు అన్ని విధాలుగా అండగా నేను ఉంటానని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు.

జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలోని పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల, పెద్దవంగర, తొర్రూరు, రాయపర్తి మండలాల్లోని కరోనా బాధితులు, వారి కుటుంబ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో మంత్రి శుక్రవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఇందులో నియోజకవర్గ వ్యాప్తంగా ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఆర్డీవోలు, ఎమ్మార్వోలు, సీఐ లు, ఎస్సైలు, డీఎండ హెచ్ఓ, డాక్టర్లతో మంత్రి మాట్లాడారు. కరోనా బాధితుల యోగ క్షేమాలు, అందుతున్న వైద్యాన్ని, తీసుకుంటున్న జాగ్రత్తలను మంత్రి ఎర్రబెల్లితో వారు పంచుకున్నారు. ఎలాంటి ఆపద వచ్చిన ఒక్క ఫోన్‌కాల్‌తో అందుబాటులో ఉంటానని ధైర్యంగా ఉండాలని మంత్రి సూచించారు.

హైదరాబాద్‌లో అల్నిచే లైఫ్ సైన్స్‌స్

హైదరాబాద్, ఫిబ్రవరి 4: నెఫ్రాలజీ మరియు క్రిటికల్ కేర్ మెడిసిన్స్‌లో కీలకమైన ఆటగాళ్లలో ఒకటైన ఆల్నిచ్ లైఫ్‌సైన్స్ హైదరాబాద్‌లో తన కార్యకలాపాలను వస్తరించేందుకు ప్రణాళికలను ప్రకటించింది. మూత్రపిండ సంరక్షణ, న్యూరో, కార్డియో మరియు క్రిటికల్ కేర్ విభాగాల్లో ఔషధాల లభ్యతను పెంచడానికి నగరంలో తన పాదముద్రలను పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆల్నిచే లైఫ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ సుమిత్ ఆరోరా మాట్లాడుతూ, భారతదేశంలోని అన్ని ప్రధాన నగరాల్లో మార్కెట్ చొచ్చుకుపోవడాన్ని పెంచడం ద్వారా ఆల్నిచే లైఫ్ సైన్స్ తన బ్రాండ్‌వృద్ధిని, వేగాన్ని వేగవంతం ద్వారా ఆల్నిచే లైఫ్ సైన్సెస్ తన బ్రాండ్ అభివృద్ధి కొసం దృష్టి సారించింది. ముందుకు వెళుతున్నపుడు, మా ఉత్పత్తులను డిమాండ్ క్రమంగా పెరుతున్న హైదరాబాద్‌లో మా వస్తరణపై దృష్టి పెట్టాలని మేమ క్రియాశీలకగా ముందుకు సాగుతున్నాము. ఆల్నిచే లైఫ్ సైన్స్‌స్ అన్ని కీలక గ్లోబల్ మార్కెట్‌లలో తన బౌగోళిక ఉనికికి పటిష్టం చేసుకోవాలని కోరుకుంటదన్నారు.

త్వరలో నగర ప్రజలకు 24 గంటల త్రాగునీరు : మంత్రి గంగుల

కరీంనగర్ ఫిబ్రవరి 4: (నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ వాసులకు ఇచ్చిన మాట మేరకు త్వరలోనే 24 గంటల తాగునీటి సరఫరాను ప్రయోగాత్మకంగా చేపడుతామని బీసీ సంక్షేమం పౌరసంఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఈరోజు 21వ డివిజన్ సీతారాంపూర్ లో 14, 15 ఆర్థిక సంఘ నిధులు రూ.1కోటి 70 లక్షలతో మంచి నీటి పైపు లైన్, రూ.20 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు మంత్రి గంగుల కమలాకర్ శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ కరీంనగర్ వాసులకు మెరుగైన సౌకర్యాలు అందించి? సుపరి పాలన అందించేందుకు చర్యలు తీసుకుం టున్నామన్నారు. ఇందుకోసం కరీంనగర్ ను సుందరనగరంగా తీర్చిదిద్ది భవిష్యత్ తరాలకు అందిస్తామని పునరుద్ఘాటించారు. పనులను నాణ్యతా యుతంగా చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కాంట్రాక్టర్ ను ఆదేశించారు.

పైప్ లైన్ నిర్మాణంతో ఈ ప్రాంత వాసులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా పోతాయన్నారు. ఇప్పటికే నగర వాసులకు ప్రతి రోజు తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. కరీంనగర్ వాసులకు ఇచ్చిన హామీ మేరకు త్వరలోనే 24 గంటల పాటు తాగునీటిని సరఫరాల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకోసం త్వరలోనే ప్రయోగాత్మకంగా చేపట్టనున్నామన్నారు. 24 గంటల నీటి సరఫరా చేస్తే ప్రజలు అవసరమున్నంత మేరకే నీటిని వాడుకుంటారని దీంతో నీటి వృధా తగ్గే అవకాశముందన్నారు. గత 67 నుంచి 70 సంవత్సరాలుగా కరీంనగర్ సుగత ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోలేదని, దీంతో కరీంనగర్ లోని రోడ్లు అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచాయన్నారు. కానీ తెరాస ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరంలో మట్టి రోడ్లు అనేది కనిపించకుండా అంతర్గత ప్రధాన రహదారులను నిర్మిస్తున్నామన్నారు. కరీంనగర్ ను సుందరనగరంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని భవిష్యత్ తరాలకు గొప్పనగరాన్ని అందించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఈ నగరం మనదని మన నగరాన్ని కాపాడుకునే బాధ్యత మన అందరిపై ఉందన్నారు.. నగర ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించి సుపరిపాలన అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ వై సునీల